KR TV

# మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...








Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :75 | గురువారం , 13 ఫిబ్రవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-


## తెలంగాణలో

# స్థానిక ఎన్నికలకు బ్రేక్?

- బీసీ కుల గణన విషయంలో నెలకొన్న సందిగ్ధత
- బీసీల సంఖ్యను తక్కువ చేసి చూపిస్తున్నారని బీసీ సంఘాలు ఆరోపణలు
- పార్టీ ముఖ్య నేతలు, అధికారులతో సీఎం రేవంత్ సమావేశం
- మరోసారి కులగణన చేస్తున్నట్లుగా ప్రకటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- బీసీ రిజర్వేషన్లు తేలిన తర్వాతనే ఎన్నికలు
- కులగణనలో పాల్గొనని వారి కోసం మరోసారి సర్వే
- ఈ నెల 16 నుంచి 28 వరకూ కులగణన సర్వే
- ఈ నెలంతా కులగణన జరగనుండగా మార్చి నెలలో ఇంటర్ పరీక్షలు
- ఆ వెనువెంటే పదవతరగతి పరీక్షలు
- పదవతరగతి పరీక్షల తర్వాతే ఎన్నికలు




రాష్ట్రంలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలవడం ద్వారా సత్తా చాటాలి అనుకుంటున్న రాజకీయ పార్టీలకు చెక్ పడినట్లే. ఇప్పుడప్పుడే ఎన్నికలకు వెళ్లేందుకు ప్రభుత్వం సుముఖంగా లేదు. ముఖ్యంగా రాష్ట్రంలో బీసీ కుల గణన విషయంలో నెలకొన్న సందిగ్ధత తేలేవరకు ఎన్నికలకు పోతే మొదటికే మోసం వస్తుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

ఇప్పటికే సర్వే పూర్తి చేశామని ప్రభుత్వం ఓ వైపు చెబుతుండగా బీసీల సంఖ్యను తక్కువ చేసి చూపిస్తున్నారని బీసీ కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి.దీంతో తెలంగాణ ప్రభుత్వం స్థానిక ఎన్నికలను మరోసారి వాయిదా వేసుకుంది. రెండు వారాల్లో ఎన్నికల తేదీల ప్రకటన ఉంటుందని ముందుగా ప్రాదేశిక ఎన్నికలు నిర్వహిస్తామని చేసిన ప్రకటనలు తుస్సుమన్నాయి.

2లో

## వరంగల్ కు రాహుల్ ఆకస్మిక పర్యటన?

# చివరి క్షణంలో రద్దు

- పీసీసీకి సమాచారం లేకుండానే పర్యటన ఖరారు
- గత 8 నెలల నుండి రేవంత్ కు దక్కని రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్
- పెండింగ్ లోనే మంత్రి వర్గ విస్తరణ
- పది మంది ఎమ్మెల్యేలు పలుమార్లు ప్రత్యేక భేటీ
- వరంగల్‌కు రాహుల్ గాంధీని ఎవరు పిలిపించారనే అనే చర్చ మొదలైంది
- సిఎం మార్పు కోసమేనా?

(శ్రీధర్ యాలాల – సీనియర్ జర్నలిస్ట్)

అధికార కాంగ్రెస్ పార్టీలో ఏదో జరుగుతోందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. 14 నెలల పరిపాలనపై సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకతమవుతున్న వేళ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర స్థాయిలో విబేధాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇప్పటికే ఎమ్మెల్యేలు గ్రూపులు గ్రూపులుగా విడిపోయారు. కలిసి ఉన్నట్టు కనిపిస్తున్నా వేర్వేరు కుంపట్లు ఏర్పాటుచేసుకున్నారు.



ఈ క్రమంలోనే అనూహ్యంగా ఎవరికీ చెప్పాపెట్టకుండా రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటనకు వస్తున్నారనే తీవ్ర సంచలనం రేపింది. పీసీసీకి సమాచారం లేకుండానే వరంగల్‌లో రాహుల్ గాంధీ సమావేశం కానున్నారనే వార్త కలకలం రేపింది. ఆకస్మికంగా ఉన్నఫళంగా రాహుల్ గాంధీ వరంగల్ పర్యటన చేపట్టారు. అనంతరం అనివార్య కారణాల రీత్యా రద్దయ్యింది. ఈ పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనం రేపుతున్నాయి.

2లో

## సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడి.. ఉద్రిక్తత



ఎన్నికల ముందు తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మున్నూరుకాపు సంఘం నాయకులు సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడించారు. దీంతో ముఖ్యమంత్రి ఇంటివద్ద ఒక్కసారిగా ఉద్రిక్తత చెలరేగింది.

2లో

## భార్య అనుమతి లేకుండా భర్త అసహజ లైంగిక చర్య నేరం కాదు : ఛత్తీస్గఢ్ హైకోర్టు

5లో

## ఆరో అంతస్తు నుంచి విరిగిపడిన సచివాలయ దిమ్మె.. తప్పిన ప్రమాదం



2లో

## మా తాతయ్య మహా రసికుడు...

### మెగాస్టార్ చిరంజీవి కామెంట్స్‌పై ట్రోలింగ్



2లో

మెగాస్టార్ చిరంజీవి తాజాగా 'బ్రహ్మా ఆనందం' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ వేదికపై తన తాత మంచి రసికుడు అంటూ చెప్పిన స్టోరీ వైరల్ అవుతుంది. తనకు ఇద్దరు అమ్మమ్మలు అని, వారిద్దరిపై అలిగితే మూడో ఇంటికి వెళ్ళేవాడు అంటూ చిరంజీవి తన తాతయ్య గురించి చెప్పారు. మరోపక్క ఆయన చేసిన కామెంట్స్ పై ట్రోలింగ్ కూడా జరుగుతుంది.

# ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్

## కామారెడ్డిలో భారీ సభ..!

తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారానికి దూరమై 14 నెలలు దాటింది. ఎన్నికల్లో ఓటమి తర్వాత ఫామ్‌హౌస్‌కే పరిమితం అయినా గులాబీ కేసీఆర్.. ఇప్పటివరకు బయటకు రాలేదు.. త్వరలోనే కేసీఆర్ బయటకు వస్తారని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నా.. ఎప్పుడు వస్తారనే విషయంలో మాత్రం క్లారిటీ ఇవ్వడం లేదు.. కానీ రాష్ట్రంలో బీసీల కోసం నిర్వహించే భారీ బహిరంగ సభ ద్వారా కేసీఆర్ బయటకు రాబోతున్నట్టు తెలుస్తోంది. త్వరలోనే కామారెడ్డి జిల్లాలో బీసీ బహిరంగ సభను నిర్వహించబోతున్నట్టు బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది.



2లో

## మోదీ విదేశీ పర్యటన..

### విమానానికి బెదిరింపులు




ప్రధాని మోదీ ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్నారు. ఫ్రాన్స్ పర్యటన తరువాత అమెరికా వెళ్లి డోనాల్డ్ ట్రంప్‌తో భేటీ కానున్నారు. ఈ సందర్భంగా మోదీపై హత్యాయత్నం జరిగే అవకాశముందని, ఉగ్రవాదులు ప్లాన్ చేశారనే సమాచారం ఒక్కసారిగా అలర్ట్ చేసింది. సెక్యూరిటీ విభాగం ఉలిక్కిపడింది.

2లో

## నేటిమాట

"కనలేని కల ఒక కల మాత్రమే. కానీ, మీ కలను నిజం చేయడానికి మీరు కష్టపడితే అది లక్ష్యంగా మారుతుంది."



-అబ్దుల్ కలాం

## ఉచిత ప్రకటనలు సరికాదు – సుప్రీంకోర్టు



2లో

ఎన్నికలకు ముందు ఉచిత వాగ్దానాలు ఇవ్వడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఉచిత ప్రకటనలు సరికాదు అని పేర్కొన్నది. ఆ విధానాన్ని కోర్టు వ్యతిరేకించింది. ఉచిత రేషన్, డబ్బు అందడం వల్ల.. ప్రజలు ఎవరూ పనిచేయడానికి ఇష్టపడడం లేదని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. రాజకీయ పార్టీలు చేస్తున్న ఉచిత వాగ్దానాలను సుప్రీంకోర్టు నిలదీసింది. దేశ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరమని, సమాజంలో ప్రజల పాత్రను పెంచాల్సిన అవసరం ఉందని కోర్టు తెలిపింది. ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి వాదిస్తూ.. పట్టణాల్లో పేదరికాన్ని నిర్మూలించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇండ్లు లేని వారి కోసం షెల్టర్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. పట్టణ పేదరిక నిర్మూలన స్కీమ్ ఎప్పటి నుంచి అమలు అవుతుందో కేంద్రాన్ని అడిగి తెలుసుకోవాలని అటార్నీ జనరల్‌ను సుప్రీంకోర్టు కోరింది.

## బ్రోకర్ మాటలతోనే రేవంత్‌రెడ్డికి అధికారం..

- ఆరు నెలల్లో కాంగ్రెస్ సర్కార్ కుప్పకూలడం ఖాయం..
- తేల్చి చెప్పిన ఎర్రబెల్లి



2లో

# మాఘ పౌర్ణమి..

## 1.83 కోట్ల మంది పుణ్యస్నానాలు



2లో

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు భక్తుల తాకిడి పెరిగింది. ఇవాళ మాఘ పౌర్ణమి సందర్భంగా పుణ్యస్నానాలు చేసేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు.గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమంలో బుధవారం తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 2 గంటల వరకూ ఏకంగా 1.83 కోట్ల మంది (కోటి 83 లక్షల మంది) భక్తులు పవిత్ర స్నానాలు చేసినట్లు యూపీ అధికారులు తెలిపారు.

# తెలంగాణలో స్థానిక ఎన్నికలకు బ్రేక్?

మొదటి పేజీ తరువాయి

సీఎం రేవంత్ తో పాటు ముఖ్య నేతలు, అధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ఈ రోజు సమావేశం అయ్యారు. ఎన్నికల తేదీలపై ఓ క్లారిటీ వస్తుందనుకున్నారు. కానీ సమావేశం తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. మరోసారి కులగణన చేస్తున్నట్లుగా ప్రకటించారు. దీంతో అందరూ షాక్‌కు గురి కావాల్సి వచ్చింది.

ఎన్నికల సమయంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కలిపిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే ఆ హామీని నెరవేర్చడానికి సమగ్ర కుల గణన పేరుతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనపై అనేక ఆరోపణలు వినవస్తున్నాయి. కుల గణన సరిగా జరగలేదని కొన్ని సంఘాలు, తమ కులాన్ని తక్కువ చేసి చూపారని మరికొన్ని సంఘాలు ఆరోపిస్తున్నాయి. అలాగే చాలామంది కులగణనలో పాల్గొనలేదని కూడా తెలుస్తోంది. ఈ క్రమంలో తెలంగాణలో జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం తర్జన భర్జన పడుతోంది. కుల గణన తేలకుండా ఎన్నికలకు వెళ్లలేని పరిస్థితిలో కాంగ్రెస్ ఉంది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్ వేసింది. బీసీ రిజర్వేషన్లు తేలిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ బడ్జెట్ సమావేశంలో చట్టం చేసి కేంద్రానికి పంపాలని భావిస్తోంది.

కాగా కులగణనలో పాల్గొనని వారి కోసం మరోసారి సర్వే నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 16 నుంచి 28 వరకూ ప్రభుత్వ సిబ్బంది కులగణన సర్వే నిర్వహించనుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. 42 శాతం ఓబీసీ రిజర్వేషన్లు ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా ప్రభుత్వ సిబ్బంది కులగణన సర్వే నిర్వహించనుందని భట్టి తెలిపారు.

కులగణన చాలా పక్కాగా జరిగిందని ప్రభుత్వం అదే పనిగా వాదిస్తోంది. అసెంబ్లీలో పెట్టి ఆమోదించుకుంది కూడా. ఆ నివేదిక ఆధారంగా బీసీ డెడికేటెడ్ కమిషన్ రిపోర్టు కూడా సమర్పించింది. ఇప్పుడు మళ్లీ రీ సర్వే అని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అనేక విమర్శలకు కారణమయ్యే అవకాశం ఉంది. కులగణన తప్పుల తడక అని తాము వాదించామని ప్రభుత్వం దాన్ని పరిగణనలోకి తీసుకుని మళ్లీ సర్వే చేస్తోందని ఇతర పార్టీలు వాదిస్తాయి. అయితే ప్రభుత్వం గతంలో కులగణనలో నమోదు చేసుకున్న వారికి మాత్రం కాదని.. మొత్తంగా 3.1 శాతం మంది నమోదు చేసుకోలేదని వారి కోసమేనని చెబుతోంది. అయితే ఇప్పుడు డబుల్ ఎంట్రీలు నమోదు చేయించుకుంటే పెద్ద సమస్య అవుతుంది. ఎందుకంటే ఆధార్ కార్డు ఖచ్చితంగా ఇవ్వాలన్న రూల్ ఏమీ పెట్టుకోలేదు. ఫలితంగా నమోదు చేసుకున్న వారు.. చేసుకోని వారు ఎవరో అంచనా వేయడం కష్టమే. ఈ వ్యవహారం మరింత గందరగోళానికి దారి తీసే అవకాశం ఉంది. సర్వేలో పాల్గొనని వారు తమ వివరాలు ఇచ్చేందుకు సిద్ధంగా లేని వారు. వారు ఇప్పుడు మళ్లీ సర్వే పెట్టినా వివరాలు ఇవ్వడం కష్టమేనన్న అభిప్రాయం ఉంది.

బీసీ డిక్లరేషన్ ప్రకటించి స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ఇచ్చిన హామీనే ఇప్పుడు కాంగ్రెస్ కు సమస్యగా మారింది. రాజకీయంగా ఆ రిజర్వేషన్లు ఇద్దామని రేవంత్ సవాల్ చేశారు కానీ.. అలా ముందుకు వెళ్తే ఇబ్బందులు ఎదురవుతాయని.. మరో ప్రయత్నం చేద్దామని వాయిదా వేస్తున్నారు. గత ఏడాది నుంచి ..స్థానిక ఎన్నికలను రేవంత్ సర్కార్ ముందుకు జరుపుకుంటూ పోతోంది.

ఈ నెలంతా కులగణన జరగనుండగా మార్చి నెలలో ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. దీంతో స్థానిక ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండకపోవచ్చు. ఆ వెనువెంటే పదవతరగతి పరీక్షలు కూడా ఉండే అవకాశం ఉంది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. మరోవైపు పదవతరగతి పరీక్షల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని సర్పంచ్‌ల సంఘం కోరింది. దీంతో ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం లేదని తేలిపోయింది.

## వరంగల్ కు రాహుల్ ఆకస్మిక పర్యటన?

# చివరి క్షణంలో రద్దు

మొదటి పేజీ తరువాయి

ఆరు గ్యారంటీలతోపాటు డిక్లరేషన్‌ల పేరిట వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర అవుతున్నా నెరవేర్చలేదు. పరిపాలనలో పూర్తిగా విఫలమవడంతో సొంత పార్టీ నాయకుల నుంచే తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రేవంత్ రెడ్డి, అతడి సోదరులపై తీవ్ర అవినీతి, దందాల ఆరోపణలు వస్తున్నాయి. మంత్రివర్గ విస్తరణ చేపట్టకపోవడం.. పదవులు పంచకపోవడం.. ప్రాజెక్టులు, నిధుల విషయంలో కూడా అన్యాయం జరుగుతోందనే అభిప్రాయం ఎమ్మెల్యేల్లో వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే పది మంది ఎమ్మెల్యేలు పలుమార్లు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తిరుగుబాటు మొదలవుతుందనే ప్రచారం తీవ్రమవడంతో వెంటనే రంగంలోకి దిగిన అధిష్టానం వెంటనే సీఎల్పీ సమావేశం నిర్వహించి ఎమ్మెల్యేలను బుజ్జగించారు.

ఈ పరిణామం అనంతరం ఢిల్లీ పర్యటన చేపట్టిన రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులకు అధిష్టానం కలిసేందుకు నిరాకరించినట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదనే వార్త హాట్ టాపిక్‌గా మారింది. కొన్ని నెలల నుంచి రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డిని పట్టించుకోవడం లేదని ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలు జరిగిన కొన్ని రోజులకే రాహుల్ గాంధీ ఉన్నఫళంగా తెలంగాణలో ఆకస్మిక పర్యటన చేపట్టడం కలకలం రేపింది.

### ఎందుకు పర్యటన?

కనీసం పీసీసీకి కూడా సమాచారం ఇవ్వకుండా వరంగల్ పర్యటనకు సిద్ధమవడంపై తెలంగాణ కాంగ్రెస్‌లో సంచలనం సృష్టించింది. రాహుల్ గాంధీ ఎందుకు పర్యటన చేయాలనుకున్నారు? అధిష్టానం తెలంగాణపై ఎలాంటి వైఖరి ఉంది? వరంగల్‌కు రాహుల్ గాంధీని ఎవరు పిలిపించారనే అనే చర్చ జరుగుతోంది. రాహుల్ ఆకస్మిక పర్యటన వార్తలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. రేవంత్ రెడ్డి వైఖరి వల్ల కాంగ్రెస్ పార్టీకి నష్టం చేకూరుతుందని అధిష్టానానికి పలువు మంత్రులు, ఎంఎల్‌ఏలు ఫిర్యాదులు చేశారు. అలాగే పొంగులేటి పై కూడా పలు ఫిర్యాదులు వెళ్ళినట్టు సమాచారం. గత కొన్ని రోజులుగా సిఎం మార్పు ఉండబోతుంది అన్న వార్తలు కూడా వస్తున్నాయి. మరి ఇలాంటి పరిస్థితుల్లో రాహుల్ గాంధీ ఈ క్రమంలోనే అనూహ్యంగా ఎవరికీ చెప్పాపెట్టకుండా తెలంగాణ పర్యటనకు రావలనుకోవడం చివరి క్షణంలో రద్దు చేసుకోవడంతో గాంధీ భవన్లో చర్చ మొదలైంది. దీని పర్యవసానం ఏం ఉండనుందో అనే ఉత్కంఠ తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొంది.

## మోదీ విదేశీ పర్యటన.. విమానానికి బెదిరింపులు

మొదటి పేజీ తరువాయి

పారిస్‌లో జరుగుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ సమ్మిట్‌కు హాజరయ్యేందుకు ఈ నెల 10న భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫ్రాన్స్ వెళ్లారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మక్రాన్‌తో భేటీ అయి ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. ఫ్రాన్స్ నుంచి అమెరాకా పర్యటన ఉంటుంది. 47వ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రధాని నరేంద్ర మోదీతో బేటీ అవుతారు. డోనాల్డ్ ట్రంప్‌తో భేటీలో వాణిజ్యం, పెట్టుబడులు, టెక్నాలజీ, డిజిటల్ రక్షణ రంగంలో సహకారం, ఉగ్రవాదం అణచివేత, కౌంటర్ టెర్రరిజం, ఇండో పసిఫిక్ రీజన్ సెక్యూరిటీ వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి.

ఇలా విదేశీ పర్యటనలో మోదీ బిజీగా ఉన్న తరుణంలో ఆయన ప్రయాణిస్తున్న విమానంపై ఉగ్ర దాడి జరుగుతుందనే సమాచారం అందర్నీ ఉలిక్కిపడేలా చేసింది. మోదీ విమానంలో ఉగ్రవాదులు దాడి చేస్తారనే పక్కా సమాచారం తన దగ్గర ఉందంటూ ఓ వ్యక్తి ముంబై పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయడంతో అంతా అలర్ట్ అయ్యారు. దీనిని సీరియస్గా తీసుకున్న పోలీసులు ఆ వ్యక్తి కోసం వేట మొదలెట్టారు. సెకన్ల వ్యవధిలో ఫోన్ కట్ అయినా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అతడిని గుర్తించారు. ముంబైలోని చెంబూర్ ప్రాంతానికి చెందిన ఈ వ్యక్తిని అరెస్ట్ చేశారు. అయితే ఈ వ్యక్తి మానసిక పరిస్థితి సరిగ్గా లేదని తేలడంతో తేలిగ్గా తీసుకున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడి..ఉద్రిక్తత

మొదటి పేజీ తరువాయి



వారిని అదుపు చేయడానికి పోలీసులు చాలా సమయం శ్రమించాల్సి వచ్చింది. ఎన్నికల సమయంలో మున్నూరు కాపుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, ఇపుడు అధికారంలోకి వచ్చాక ఆ హామీని గాలికి వదిలేశారని మున్నూరు కాపు సంఘం నాయకులు ఆరోపించారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ, ముఖ్యమంత్రి వైఖరికి నిరసనగా మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్మసేన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసం ముట్టడికి ప్రయత్నించారు.

ధర్మసేన సంస్థ రాష్ట్ర కన్వీనర్ ఉగ్గే శ్రీనివాస్ పటేల్ ఆధ్వర్యంలో పలువురు మున్నూరుకాపు నాయకులు జూబ్లీహిల్స్ రోడ్ నెం 36 నుంచి సీఎం నివాసానికి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే ఆందోళన కారుల విషయం ముందుగానే పసిగట్టిన పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు వెళ్లేందుకు యత్నిస్తున్న సంస్థ కన్వీనర్ శ్రీనివాస్ పటేల్‌తో సహా పదిమందిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు.

ఈ సందర్భంగా శ్రీనివాస్ పటేల్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నిర్వహించామని చెబుతున్న బీసీ కులగణనలో మున్నూరు కాపుల జనాభాను తక్కువ చేసి చూపించారని ఆరోపించారు. రాజకీయంగా మున్నూరు కాపులు ఎదుగుతారనే దురాలోచనతోనే పలు జిల్లాల్లో ఉన్న మున్నూరు కాపులను ఓసీ జాబితాలోకి చేర్చారన్నారు. గత ప్రభుత్వం హయాంలో మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ కోసం తాము ఆందోళన చేస్తున్నప్పుడు మద్దతు పలికిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు మాత్రం నోరుమెదపడం లేదని మండిపడ్డారు. మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహాన్ని ఎండోమెంట్ పరిధిలో నుంచి తొలగించాలని, మున్నూరు కాపుల పేరు చివరన అందరికీ పటేల్ అని చేర్చేలా గెజిట్ విడుదల చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరు కాపులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## ఉచిత ప్రకటనలు సరికాదు

### - సుప్రీంకోర్టు

మొదటి పేజీ తరువాయి

జస్టిస్ బీఆర్ గవాయి, ఆగస్టిన్ జార్జ్ మాషిలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. షెల్టర్ హోమ్స్ గురించి దాఖలైన పిటీషన్‌పై విచారిస్తూ కోర్టు ఇలా వ్యాఖ్యానించింది. ఫ్రీ రేషన్ వస్తోందని, పని చేయకుండానే పైసలు వస్తున్నాయని జస్టిస్ గవాయ్ తెలిపారు. ప్రజల పట్ల ఉన్న శ్రద్ధను మెచ్చుకుంటున్నామని, కానీ వాళ్లను పనిచేసేలా తయారు చేయవద్దు అని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. మరో ఆరు వారాల తర్వాత కేసుపై విచారణ చేపట్టనున్నట్లు కోర్టు తెలిపింది.

# ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్

## కామారెడ్డిలో భారీ సభ..!

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎదుట BRS వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక డిమాండ్ పెట్టారు. మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం కులగణన రీసర్వే చేపడితే కేసీఆర్ సహా అందరం అందులో పాల్గొంటామని సవాల్ చేశారు. మొన్న చేసిన కులగణన సర్వే మొత్తం తప్పుల తడకగా ఉందని విమర్శించారు. బీసీల గొంతు కోసేలా ప్రభుత్వం వ్యవహరించిందని అన్నారు. బీసీ జనాభా ను ఐదున్నర శాతం తగ్గించారని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కులగణన సర్వే తమకు చిత్తు కాగితంతో సమానమని కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ బీసీ నేతలతో సమావేశమైన మంత్రి కేటీఆర్ శాస్త్రీయంగా మళ్లీ రీసర్వే చేయాలని డిమాండ్ చేశారు.

ఇటీవల బీఆర్ఎస్ ముఖ్య లీడర్లతో ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ సమావేశం అయ్యారు. ఈ భేటీలో తాను మౌనంగా ఉన్నారని.. తాను కొడితే ఎంత బలంగా ఉంటుందో చూడాలన్నారు. అంతేకాదు రైతు రుణమాఫీ, రైతు భరోసా నిధులు ఇవ్వడంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఫెయిల్ అయ్యిందని విమర్శించారు. అయితే త్వరలోనే తాను ప్రజాక్షేత్రంలోకి రాబోతున్నట్టు ప్రకటించారు. తన సొంత ఇలాకాలో ఓ భారీ బహిరంగ సభను నిర్వహించి అక్కడి నుంచి సమరశంఖం పూరించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఇదిలా ఉండగానే.. కామారెడ్డి కేంద్రంగా మరో సభను కూడా తలపెట్టాలని కేసీఆర్ నిర్ణయించినట్టు సమాచారం. ఈ రెండు సభల ద్వారా తిరిగి ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని కేసీఆర్ డిసైడ్ అయినట్టు తెలుస్తోంది. ఇదే విషయాన్ని బీసీ నేతల మీటింగ్‌లో కేటీఆర్ క్లారిటీ ఇచ్చారని సమాచారం.

మొత్తంగా గజ్వేల్ వేదికగా రైతు గర్జన సభను ప్లాన్ చేసిన బీఆర్ఎస్.. కామారెడ్డి కేంద్రంగా బీసీ గర్జన సభకు రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. అయితే గజ్వేల్ సభను మాత్రం దాదాపు 5 లక్షల మందితో నిర్వహించబోతున్నారట. మరోవైపు రాష్ట్రంలో బీసీలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. కులగణలో బీసీల జనాభాను తక్కువ చేసి చూపించారని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ఇదే అంశాన్ని రాజకీయంగా వాడుకోవాలని ప్లాన్ చేస్తున్నారు. అందుకే కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించిన వేదికనే ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ వాడుకోవాలని లెక్కలు వేసుకుంటోందట. మొత్తం మీద ఈ రెండు సభల ద్వారా కేసీఆర్ రీ ఎంట్రీ ఖాయమైందని గులాబీ లీడర్లు ఖుషీ ఖుషీ అవుతున్నట్టు తెలిసింది.

# మా తాతయ్య మహా రసికుడు...

## మెగాస్టార్ చిరంజీవి కామెంట్స్‌పై ట్రోలింగ్



**'బ్రహ్మ ఆనందం' ప్రీ రిలీజ్ ఈవెంట్ కి గెస్ట్ గా...**

మెగాస్టార్ చిరంజీవి సెకండ్ ఇన్నింగ్స్ లో వరుస సినిమాలతో దూకుడు చూపిస్తున్నారు. ప్రస్తుతం 'విశ్వంభర' అనే మూవీతో బిజీగా ఉన్న చిరంజీవి ఈ మూవీ పూర్తి కాగానే అనిల్ రావిపూడి తో పాటు శ్రీకాంత్ ఓదెల వంటి యంగ్ డైరెక్టర్స్ ను లైన్ లో పెట్టారు. ఓ పక్క వరుస సినిమాలో చేస్తున్న చిరు మరోపక్క ఇతర సినిమాలకు సపోర్ట్ ఇవ్వడానికి స్పెషల్ గెస్ట్ గా పలు సినిమాల ఈవెంట్లకు కూడా హాజరవుతున్నారు. మంగళవారం జరిగిన 'బ్రహ్మ ఆనందం' మూవీ ఈవెంట్ కి ఆయన గెస్ట్ గా హాజరయ్యారు. రాహుల్ యాదవ్ నక్కా నిర్మాతగా, నిఖిల్ దర్శకత్వంలో రూపొందుతున్న మూవీ 'బ్రహ్మ ఆనందం'. ఇందులో కామెడీ బ్రహ్మ బ్రహ్మానందంతో పాటు ఆయన కొడుకు రాజా గౌతమ్ కూడా నటిస్తున్నారు. అలాగే వెన్నెల కిషోర్ కీలకపాత్రను పోషిస్తున్నారు. ఫిబ్రవరి 14న ఈ మూవీ రిలీజ్ కాబోతోంది.

### తాతపై మెగాస్టార్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

'బ్రహ్మ ఆనందం' మూవీ ఈవెంట్లో యాంకర్ సుమ సెలబ్రిటీలను కొన్ని ఇంట్రెస్టింగ్ ప్రశ్నలు అడిగింది. అందులో భాగంగానే చిరంజీవి తాతయ్య ఫోటోను స్క్రీన్ పై చూపించి, ఆయన గురించి చెప్పమని అడిగింది. దీంతో మెగాస్టార్ తన తాతను గుర్తు చేసుకుంటూ ఇంట్రెస్టింగ్ కామెంట్ చేశారు. "ఆయన మా అమ్మగారి తండ్రి, పేరు రాధాకృష్ణమ నాయుడు. ముందు నెల్లూరులో ఉండే ఆయన తర్వాత మొగల్తూరుకు షిఫ్ట్ అయ్యి, అక్కడే సెటిల్ అయ్యారు. స్టేట్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గా పని చేసి రిటైర్ అయ్యారు. నీకు ఆయన బుద్ధులు మాత్రం రాకూడదు అనేవాళ్ళు మా వాళ్ళు. ఎందుకంటే మా తాత మంచి రసికుడు" అంటూ తన తాత రొమాంటిక్ స్టోరీని వివరించారు చిరు.

"నాకు ఇద్దరు అమ్మమ్మలు, ఇద్దరూ ఇంట్లోనే ఉండేవారు. వీరిద్దరి మీద అలిగితే మాత్రం ఆయన మూడవ ఇంటికి వెళ్ళేవారు. అలా నాకు తెలిసి ముగ్గురు. ఇంకా నాలుగు, ఐదు కూడా ఉండవచ్చేమో... నాకు తెలియదు. ఆయన్ని మాత్రం ఆదర్శంగా తీసుకోవద్దని చెప్పి మరీ ఇండస్ట్రీకి పంపించారు. అందుకే నేను మా తాతయ్యను ఆదర్శంగా తీసుకోలేదు. కానీ ఆయన దానధర్మాలు మాత్రం బాగా చేసేవారు. అది ఒక్కటి మాత్రం అందిపుచ్చుకున్నాను" అంటూ చిరు చెప్పుకొచ్చారు. దీంతో ఈవెంట్ లో చిరంజీవి కామెంట్స్ కి హోరెత్తింది. కానీ మరోవైపు అలాంటి ఈవెంట్లో చిరంజీవి లాంటి వ్యక్తి ఇలాంటి కామెంట్స్ చేయడం ఏంటి? అంటూ మండిపడుతున్నారు నెటిజెన్లు. బ్రహ్మానందం గురించి మాట్లాడుతున్న సమయంలో వాడిన ఒక పదం మీద తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి.

# మాఘ పౌర్ణమి..

## 1.83 కోట్ల మంది పుణ్యస్నానాలు

మొదటి పేజీ తరువాయి

మాఘ పౌర్ణమి స్నానాలు ఇవాళ సాయంత్రం 7:22 వరకూ కొనసాగనున్నాయి. దాదాపు 2 నుంచి 3 కోట్ల మంది ఇవాళ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు కుంభమేళా ప్రాంతంలో దాదాపు 15 కిలోమీటర్ల మేర రద్దీ నెలకొంది. భక్తులపై యూపీ సర్కార్ హెలికాప్టర్ల ద్వారా పూల వర్షం కురిపించారు. 25 క్వింటాళ్ల పూలను భక్తులపై వెదజల్లారు.

**నేడు 'నో వెహికిల్ జోన్'గా ప్రయాగ్‌రాజ్**

మరోవైపు భక్తుల రద్దీ దృష్ట్యా యూపీ సర్కార్ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. గత నెల మౌనీ అమావాస్య సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటన నేపథ్యంలో ఇవాళ మహాకుంభమేళాలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మాఘ పూర్ణిమ మంగళవారం సాయంత్రం 6.55 గంటలకు ప్రారంభమై బుధవారం రాత్రి 7.22 గంటలకు ముగుస్తుంది. మంగళవారం తెల్లవారుజాము 4 నుంచి మేళా ప్రాంతాన్ని 'నో వెహికిల్ జోన్'గా అధికారులు ప్రకటించారు. అత్యవసర, నిత్యావసర సర్వీసులకు చెందిన వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. దీంతో యాత్రికులు సంగమం వద్దకు దాదాపు 8 నుంచి 10 కిలోమీటర్ల మేర నడవాల్సి వస్తోంది. మరోవైపు ఫిబ్రవరి 8వ తేదీ నుంచి మహా కుంభమేళాకు వెళ్లే దారులన్నీ 300 కిలోమీటర్ల దూరం వరకు వాహనాలతో కిక్కిరిసిపోయాయి.

కాగా, పౌష్ పూర్ణిమ సందర్భంగా జనవరి 13వ తేదీన మహాకుంభమేళా ప్రారంభమైంది. ఫిబ్రవరి 26 శివరాత్రి వరకూ ఈ కుంభమేళా కొనసాగనుంది. దాదాపు 45 రోజులపాటూ జరిగే ఈ మహా కుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి దాదాపు 55 కోట్ల మంది భక్తులు వస్తారని యూపీ ప్రభుత్వం అంచనా వేస్తోంది. అందుకు తగ్గట్లు ఏర్పాటు చేసింది. ఇక ఇప్పటివరకు 46.25 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించారు.

# బ్రోకర్ మాటలతోనే రేవంత్‌రెడ్డికి అధికారం..

బ్రోకర్ మాటలతో రేవంత్ రెడ్డి అధికారం చేపట్టారని, గత 15 నెలల పాలనలో అభివృద్ధి శూన్యమని ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సాయి గార్డెన్స్‌లో జరిగిన బీఆర్ఎస్ నాయకుల సమీక్షా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి దయాకర్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి పనులు శూన్యం అని స్పష్టం చేశారు. అభివృద్ధి పథకాల్లో పేర్ల మార్పుతోనే ఎంతో అభివృద్ధి చేశామని కాంగ్రెస్ ఆనందంలో ఉందన్నారు.తేదీల్లో మార్పు, దేవుళ్లపై ఓట్లు సీఎం రేవంత్ రెడ్డి తీరని దయాకర్ రావు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో రేవంత్ రెడ్డికి, పార్టీ ఎమ్మెల్యేలకు సమన్వయం కొరబడిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధిష్టానంలో ఒక తీరు రాష్ట్రంలో ఒక తీరు జరుగుతుండడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో ఆ పార్టీ ఉందన్నారు. మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు వస్తే రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ సీఎం కావడంతోపాటు బీఆర్ఎస్ పార్టీకి 100 సీట్లు రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదని స్పష్టం చేశారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, వృద్ధులకు పెన్షన్లతోపాటు కౌలు రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా అన్ని పూర్తి చేశామని ప్రకటనలు చేయడం సిగ్గుచేటు అన్నారు.రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీలో సమన్వయం లేక ఇప్పటికి మంత్రివర్గ విస్తరణ చేయలేదని దయాకర్ రావు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి సమాచారం లేకుండానే వరంగల్ పర్యటనకు వస్తానని రాహుల్ గాంధీ ప్రకటించడం లోనే ఇది అర్థమవుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆరు జెడ్పీటీసీలు టీఆర్ఎస్‌కే రావడం ఖాయమని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని నిలదీయాలని పిలుపునిచ్చారు కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని ఏ ఒక్కరు అధైర్య పడొద్దని హామీ ఇచ్చారు.


# ఆరో అంతస్తు నుంచి విరిగిపడిన సచివాలయ దిమ్మె.. తప్పిన ప్రమాదం

మొదటి పేజీ తరువాయి



తెలంగాణ సచివాలయంలో పెద్ద ప్రమాదమే తప్పించి. సచివాలయ భవన ఆరో అంతస్తు నుంచి పీవోపీ పార్టిషన్ దిమ్మె లాంటి భారీ పెచ్చు ఊడి కింద పడింది. సీఎం ఛాంబర్ అంతస్తు నుంచే ఈ దిమ్మె ఊడటం గమనార్హం. అయితే.. ఊడిన దిమ్మె కింద నిలిపి ఉంచిన రామగుండం మార్కెట్ కమిటీ ఛైర్మన్ కారుపై పడింది. దీంతో.. కారు రూఫ్ తీవ్రంగా దెబ్బతిన్నది. ఆ సమయంలో కారులో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పినట్టయింది. పెచ్చులు ఊడిపడడంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందారు. పీఓపీ పెచ్చులు ఊడి పడటంతో అధికారులు, భద్రతా సిబ్బంది అప్రమత్తం అయ్యారు. ఇటీవలే కొత్తగా నిర్మించిన తెలంగాణ సచివాలయం పీఓపీ కూలడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. ఒకవేళ అక్కడ కారు లేకుండా ఎవరైనా జనాలు ఉండి ఉంటే పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# చిన్నారిని రవళిని ఆశిర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



రాయపర్తి, 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెరికేడ్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నిమ్మల కుమార్ కూతురు రవళిక నూతన వస్త్ర ఫల పుష్పలంకరణ మహోత్సవం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం లో మాజీ జెడ్పిటిసి రంగు కుమార్ గౌడ్,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, సర్పంచ్ చిన్నాల తారాశ్రీ రాజబాబు,జాజు నాయక్, భాషాబోయిన సుధాకర్, చందు రాముయాదవ్, కుళ్ళ వెంకన్న, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిల్లా సుధీర్ రెడ్డిని సన్మానించిన యాదవ సంఘం సభ్యులు



రాయపర్తి, 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): మండల కేంద్రానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు,మాజీ టిపిసిసి సెక్రటరీ బిల్లా సుధీర్ రెడ్డి ఇటీవల బిఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన యాదవ సంఘం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం సుధీర్ రెడ్డి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు కోతి వీరన్న, రాయపర్తి గ్రామ యాదవ సంఘం ఉపాధ్యక్షులు నాగుల రాంబాబు, యాదవ సంఘం మాజీ అధ్యక్షులు బక్కతట్ల సాయిలు, కసరబోయిన శ్రీనివాస్, ఉడుత రాజు, చందు రవి,కుంట కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ ఈటల రాజేందర్ చిత్రపటానికి పాలాభిషేకం





పర్వతగిరి, 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బీజేపీఎస్ సి మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర నాయకులు అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు గ్రీన్ ఫీల్డ్ హైవే బాధితులకు అండగా నిలిచి పార్లమెంట్ లో వారి సమస్యలపై మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మాట్లాడగా నేడు వర్ధన్నపేట నియోజకవర్గం ఏనుగల్ గ్రామంలో రైతులు నిర్వహించినటువంటి ఈటల రాజేందర్ చిత్రపటానికి ముఖ్య అతిథిలుగా పాలుగొని పాలాభిషేకం చేసినారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు,మాజీ శాసనసభ్యులు, భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్ని రవీందర్, బిజెపి యువ నాయకుడు ఆదిత్య చిన్న, రైతులు నల్లపు దేవేందర్, బుక్క దేవేందర్, కాని గంటి రాములు, నరసింగం, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, సాంబయ్య, బిక్షపతి, లక్ష్మణ్, రమేష్, నరేందర్ గ్రామ రైతులు స్థానికులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సీ సెల్ జిల్లా నూతన అధ్యక్షుడికి నియామక పత్రం అందజేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



హనుమకొండ 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నూతంగా నియమితులైన తుల్ల రవి కి హనుమకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే నివాస క్యాంప్ కార్యాలయం నందు నియామకపత్రం అందజేసి శాలువాతో సత్కరించి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నాయకులతో కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అధ్యక్ష పదవికి వన్నె తెచ్చే విధంగా కష్టపడి పనిచేయాలని సూచలనలు సలహాలు చేశారు.ఈకార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, దేవస్థాన చైర్మన్ కమ్మగొను ప్రభాకర్ గౌడ్,ఐనవోలు మండల అధ్యక్షుడు మహేష్ గౌడ్,సీనియర్ నాయకులు అనీమిరెడ్డి కృష్ణా రెడ్డి,ఎస్టీ సబ్ రాష్ట్రనాయకులు రాయాపురం సంనుఅయ్య, కాంటెస్ట్ జెడ్పీటీసీ పోలేపెల్లి బుచ్చి రెడ్డి,శ్రిపాది సతీష్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రతి బాను ఎస్సీసెల్ వరంగల్ జిల్లా నాయకులు పూర్ణ చందర్ నాంపెల్లి యాదగిరి,బరిగల ఏలీయా,తిరుపతి అన్న, కర్ర శ్రీనివాస్ రెడ్డి,ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర,జిల్లా, మండల,గ్రామస్థాయి నాయకులు కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినులకు ఆర్థిక అంశాల పట్ల అవగాహనకల్పించిన బ్యాంక్ మేనేజర్ జనార్ధన్




పర్వతగిరి, 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): పర్వతగిరి మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కళాశాలలో బుధవారం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పీఎంశ్రీ యోజన ఫేస్ 2 లో భాగంగా ప్రిన్సిపాల్ పి . అపర్ణ ఆధ్వర్యం లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ ఎల్ జనార్ధన్, అసిస్టెంట్ మేనేజర్, కే.తిరుపతి పాఠశాలకు విచ్చేసి విద్యార్థులకు బేసిక్స్ ఆఫ్ బ్యాంకింగ్, సేవింగ్స్, డిజిటల్ అంశాలు, యూపీఏ అవేర్నెస్, స్మార్ట్ బడ్జెట్ ప్లానింగ్, అండర్స్టాండింగ్ లోన్స్ అండ్ ఇన్వెస్ట్మెంట్స్, ఇన్సూరెన్స్ అంశాల గురించి చక్కగా వివరించారు. అవగాహన కల్పించినందుకు గాను మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ లను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం మెమొంట్లతో సత్కరించారు.

# JEE ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన RDF విద్యార్థులు



పర్వతగిరి, 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): జనవరి నెలలో జరిగిన JEE మెయిన్స్ పరీక్షలో ఆర్ డి ఎఫ్-వనిత అచ్యుతపై విద్యాలయ జూనియర్ కళాశాల నుండి సుమారు 30 మంది విద్యార్థులు పరీక్ష వ్రాసి తమ అత్యుత్తమ ప్రతిబ,`కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఏ జనార్ధన్ తెలిపారు. రామవత్ సుమన్ 78.65, జటోతు వెంకటేష్ 75.04 సిరి చందన 74.98 పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీరిని ఉద్దేశించి ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల క్రమశిక్షణ, తల్లిదండ్రులు ఆర్ డి ఎఫ్ మేనేజ్మెంట్ ల సహకారం, ఉపాధ్యాయుల సరియైన ప్రణాళికతో ఈ విజయం సాధ్యమైనట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ. రాజు, అధ్యాపకలు రాంబాబు, సంతోష్, మహేశ్వర్, సుధాకర్, సైదులు, జయశంకర్, శ్రీనివాస్, సతీష్ అభినందనలు తెలిపారు. విజయం సాధించిన రమవత్ సుమన్ మాట్లాడుతూ ఇంటర్ సెకండ్ ఇయర్ ఏంపీసి చదువుతున్నాను. మాది పర్వతగిరి మండలం సీత్యా తండ ఈ మారు మూల ప్రాంతం కల్లెడ లో జేఈఈ మెయిన్స్ కోచింగ్ శిక్షణ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. నేను ఆర్ డి ఎఫ్ విద్యార్థిని అని తెలుపుటకు సంతోషిస్తున్నాను. మాకు చదువు కోవడానికి కావలసిన అన్ని వసతులను కల్పించిన యాజమాన్యానికిధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అదేవిధంగా ఉపాధ్యాయుల సహకారంతో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ విజయం సాధ్యమైంది. నేను బాగా చదివి ఒక సైంటిస్టు కావలని ఉందని రామావత్ సుమన్ తెలిపారు.

# ఆరూరి వెంకటమ్మ దశదిన కార్యక్రమంలో పాల్గొన్న వర్ధన్నపేట ప్రజా సంఘ నాయకులు




వర్ధన్నపేట, 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): జనగామ జిల్లా జఫర్గడ్ మండలం ఉప్పుగల్లు గ్రామంలో వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్ తల్లి కీ,,శే,, ఆరూరి వెంకటమ్మ దశదిన కార్యక్రమంలో పాల్గొని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నరసయ్య, సీనియర్ అంబేద్కర్ నాయకులు ఇల్లందుల సుదర్శన్, జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్, ఎమ్మార్పీఎస్ పోలిట్ బ్యూరో సభ్యుడు ఈరెల్లి శ్రీనివాస్, తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా కో కన్వీనర్ జంగిలి భాస్కర్, బిజెపి జిల్లా యువజన నాయకులు బొట్ల మధు, వర్ధన్నపేట నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి జనగాం చంద్రమౌళి, రమేష్ పాలుగొని ఆరూరి కుటుంబ సభ్యులను పరామర్శించినారు.

# సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలను జరుపుకోవాలి: ఎమ్మార్వో రవి కిరణ్



ఖమ్మం, 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): సంత్ శ్రీ శ్రీ సేవలల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారంగా నిర్వహిస్తుందని సమితి సభ్యులు ఈ కార్యక్రమాన్ని ఆచార వ్యవహారాలు పాటించి, సంప్రదాయంగా జరుపుకోవాలని సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవ కమిటీ మండల ప్రత్యేక అధికారి ఖమ్మం అర్బన్ ఎమ్మార్వో రవి కిరణ్ సూచించారు. మందు, మాసం, చెడు అలవాటులు నుండి బయటపడి సుఖ సంతోషాలతో ప్రతి ఒక్కరూ జీవించాలని సేవలాల్ మహా చెప్పిన మాటలను ఈ సందర్భంగా గుర్తు చేశారు . అలాగే ఈనెల 15 నుండి 21 వరకు ఖానాపురం ఖమ్మం అర్బన్ మండలం యుపిఎహె కాలనీలో ఉన్న సేవాలాల్ మహారాజ్ ఆలయంలో రాజకీయ పార్టీలకు అతీతంగా జరిగే ఉత్సవాలను విజయవంతం చేయాలని సేవలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు బానోతు కిషన్ నాయక్ కోరారు.ఈ కార్యక్రమంలో సేవలాల్ సేన జిల్లా నాయకుడు గూగులోత్ రాజ్ కుమార్, సురేష్ నాయక్, మణికంఠ నాయక్, రాఘవేంద్ర నాయక్, నరేష్ నాయక్, బిక్కు నాయక్, వెంకన్న నాయక్, సూర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండలో యశ్విని హాస్పిటల్ ప్రారంభోత్సవం



హనుమకొండ, 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): హనుమకొండ జిల్లా హనుమకొండ పట్టణంలోని 53వడివిజన్ బీమారం ప్రధాన రహదారిలో నూతనంగా యశస్వి హాస్పిటల్ ని ప్రారంభించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,వర్ధన్నపేట నియోజకవర్గశాసనసభ్యులు కెఆర్ నాగరాజు, డోర్నకల్ మాజీ శాసనసభ్యులు రెడ్యానాయక్, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు డా.జి. చైతన్య,హాస్పిటల్ యాజమాన్యానికి శుభ సందర్భంగా ఎమ్మెల్యేలు శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానికప్రజా ప్రతినిధులు,పార్టీనాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు వరంగల్ సీపీ



వరంగల్, 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపేందుకు వరంగల్ కమిషనర్ పోలీసులు సన్నద్ధమయ్యారు. ఇందులో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలోని వివిధ ఇసుక ర్యాంపులను పరిశీలించారు. ఇసుకను అక్రమంగా రవాణాకు పాల్పడే వారి పట్ల సున్నితంగా వ్యవహరించవద్దని పోలీస్ కమిషనర్ అధికారులను ఆదేశించారు.

# ఏపీలో బర్డ్ ఫ్లూ భయం..

## అప్రమత్తమైన పశుసంవర్ధక శాఖ..



ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలను బర్డ్ ఫ్లూ భయం వెంటాడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాలలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్లు తేలింది. దీంతో ప్రజలు చికెన్ తినాలంటే హడలిపోతున్నారు. దీంతో తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు సైతం పడిపోయాయి. ఈ నేపథ్యంలోనే చికెన్ లవర్స్‌కు ఏపీ ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఈ మేరకు ఏపీ పశుసంవర్ధక శాఖ కీలక ప్రకటన జారీ చేసింది. ఏపీతో పాటుగా పొరుగున ఉన్న మహారాష్ట్రలోనూ బర్డ్ ఫ్లూ వైరస్ విజృంభిస్తోంది. ఈ వైరస్ కారణంగా కోళ్లఫారాలలో పెద్ద సంఖ్యలో కోళ్లు మరణిస్తున్నాయి. ఈ వైరస్ కారణంగా ఉభయ గోదావరి జిల్లాల్లో ఇప్పటికే వేలాది కోళ్ళు చనిపోయాయి. చనిపోయిన కోళ్ల నుంచి నమూనాలను సేకరించి టెస్ట్ చేస్తే బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయ్యింది.

ఈ నేపథ్యంలోనే తూర్పుగోదావరి జిల్లా కానూరు, పశ్చిమ గోదావరి జిల్లాలలో బర్డ్ ఫ్లూ వైరస్ కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారులు చికెన్ దుకాణాలను మూసి వేయించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు బర్డ్ ఫ్లూ వైరస్ వెలుగు చూసిన ప్రాంతం నుంచి కిలోమీటర్ పరిధిని అలర్ట్ జోన్‌గా ప్రకటించారు. అలాగే 10 కిలోమీటర్ల పరిధిని సర్వైలెన్స్ జోన్‌గా ప్రకటించారు. ఈ ప్రాంతం నుంచి కోళ్లు, కోళ్ల ఉత్పత్తుల రాకపోకలను పూర్తిగా నిషేధించారు. అలాగే అలర్ట్ జోన్ మినహా మిగతా ప్రాంతాల్లో బాగా ఉడకబెట్టిన చికెన్, కోడిగుడ్లు తినొచ్చని ఏపీ పశుసంవర్ధక శాఖ తెలిపింది. బాగా శుభ్రం చేసిన, ఉడికించిన మాంసం తినొచ్చని తెలిపింది.

మరోవైపు బర్డ్ ఫ్లూ వైరస్ పశువులు, పక్షులు, జంతువుల నుంచి మనుషులకు సోకుతుంది. కోళ్ల నుంచి వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కోళ్లఫారాలలో పనిచేసే వారు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. అలాగే బర్డ్ ఫ్లూ వైరస్ బారినపడ్డ జంతువులు, పక్షులకు దగ్గరగా గడిపినవారికి, ఈ వైరస్ సోకిన కోళ్లను తిన్న వారికి ఈ వైరస్ వ్యాపించే ప్రమాదం ఉంది. ఉడికీ ఉడకని చికెన్ తినడం ద్వారా కూడా మనుషులకు విస్తరించే ప్రమాదం ఉంది. మరోవైపు బర్డ్ ఫ్లూ వైరస్ సోకితే.. వ్యాధి లక్షణాలు 2 నుంచి 6 రోజుల్లో కనిపిస్తాయి. జ్వరంతో పాటుగా, జలుబు, ముక్కుకారడం, శ్వాసలో ఇబ్బంది, గొంతునొప్పి, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు చెప్తున్నారు. ఇక బర్డ్ ఫ్లూ కారణంగా ఇప్పటికే చికెన్ రేట్లు పడిపోగా.. ప్రజలు ప్రత్యామ్నాయాల వైపు దృష్టి సారిస్తున్నారు. చేపలు, రొయ్యలు వంటి ప్రత్యామ్నాయాల వైపు దృష్టి సారిస్తున్నారు.

# ఈ ఏడాదిలోనే సూపర్ సిక్స్ పథకాల అమలు..

## బడ్జెట్‌లో కేటాయింపులు!..

సూపర్ సిక్స్ పథకాలపై ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్లారిటీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలను ఎప్పుడు అమలు చేస్తారంటూ గత కొంతకాలంగా వైసీపీ విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఎన్నికలో సమయంలో టీడీపీ కూటమి తరుపున హామీలు ఇచ్చిన చంద్రబాబు.. వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్‌తో పాటుగా ఆ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో సూపర్ సిక్స్ పథకాల అమలుపై చంద్రబాబు క్లారిటీ ఇచ్చేశారు. ఫిబ్రవరి 24 నుంచి ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 28న ఏపీ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. శాసనసభ, శాసనమండలిలలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు.

ఈ నేపథ్యంలో వార్షిక బడ్జెట్‌పై సీఎం నారా చంద్రబాబు నాయుడు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఉండవల్లిలోని తన నివాసంలో చంద్రబాబు వార్షిక బడ్జెట్ మీద ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల అమలుపై క్లారిటీ ఇచ్చారు. ఈ ఏడాది నుంచే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని.. అందుకు తగిన విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని చంద్రబాబు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు సూచించినట్లు తెలిసింది. ఈ ఏడాదిలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ప్రభుత్వం అమలు చేయనున్నట్లు తెలిసింది ఈ నేపథ్యంలోనే ఆయా పథకాల అమలుకు బడ్జెట్‌లో కేటాయింపులపై చంద్రబాబు చర్చించినట్లు సమాచారం. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సమన్వయం చేసుకుంటూ బడ్జెట్ రూపొందించాలని చంద్రబాబు సూచించినట్లు తెలిసింది.



మరోవైపు ఏపీ ఎన్నికల సందర్భంగా టీడీపీ సూపర్ సిక్స్ హామీలు ఇచ్చిన సంగతి తెలిసిందే. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పింఛన్ల పెంపు, అన్నదాత సుఖీభవ, ఆడబిడ్డ నిధి పేరిట 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఇలా హామీలు ఇచ్చారు. ఈ హామీల అమల్లో భాగంగా ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్ల ఏర్పాటు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభించింది టీడీపీ కూటమి సర్కారు. మిగతా హామీలైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవను మే, జూన్ నెలల్లో ప్రారంభించనున్నట్లు తెలిసింది. అలాగే ఉగాది కానుకగా ఉచిత బస్సు ప్రయాణం హామీని నెరవేరుస్తారనే ప్రచారం జరుగుతోంది.

# ఆలయాల పర్యటన వెనుక అసలు కారణమేంటో చెప్పిన పవన్ ..

## ఆరోగ్యంపైనా కీలక వ్యాఖ్యలు



తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరోసారి స్పందించారు. ఈ కేసును ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా నలుగురుని అరెస్ట్ కూడా చేశారు. ఈ నేపథ్యంలో కేరళలో పర్యటిస్తున్న పవన్ కళ్యాణ్.. తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై స్పందించారు. అగస్త్య మహర్షి ఆలయం సందర్శన అనంతరం మీడియాతో మాట్లాడిన పవన్ కళ్యాణ్.. ఈ అంశంపై రియాక్టయ్యారు. తిరుమల వెంకటేశ్వరస్వామికి దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఉన్నారని పవన్ కళ్యాణ్ అన్నారు. తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తులు ఎంతో నమ్మకంగా, ఆధ్యాత్మిక చింతనతో వస్తుంటారన్న పవన్ కళ్యాణ్... అలాంటి భక్తుల మనోభావాలు గాయపడకూడదనేదే తన ఆవేదన అని చెప్పారు.

తిరుమల లడ్డులో కల్తీ జరగడం దురదృష్టకరమన్న పవన్ కళ్యాణ్.. ఇలాంటి ఘటనలు మళ్లీ భవిష్యత్తులో జరగకూడదని కోరుకున్నారు. తిరుపతి లడ్డూ వ్యవహారంలో పాత్ర ఉన్న వాళ్ళని అరెస్టు చేయడం సంతోషించదగిన విషయమన్న పవన్ కళ్యాణ్.. అదంతా కేసు దర్యాప్తులో భాగమని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా టీటీడీ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శ్రీవారి ప్రసాదాలు, ఇతర వ్యవహారాల్లో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

మరోవైపు దక్షిణాది రాష్ట్రాల్లోని ఆలయాల సందర్శనపై పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆలయాల సందర్శన పూర్తిగా తన వ్యక్తిగత అంశమని వెల్లడించారు, తన పర్యటనకు రాజకీయాలతో సంబంధం లేదని క్లారిటీ ఇచ్చారు. నాలుగున్నర సంవత్సరాల క్రితం చెల్లించుకోవలసిన మొక్కుల కోసం ఈ పర్యటనకు వచ్చినట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. తన ఆరోగ్యం సహకరించపోయినా రావాల్సి వచ్చిందని వివరించారు. కేరళతో పాటు తమిళనాడులో ఉన్న ఆలయాలను దర్శించుకోనున్నట్లు పవన్ కళ్యాణ్ వివరించారు. మరోవైపు పవన్ కళ్యాణ్ స్పాండిలైటిస్ సమస్యతో బాధపడుతున్న సంగతి తెలిసిందే. గత కొన్నిరోజులుగా స్పాండిలైటిస్ సమస్యతో బాధపడుతున్న పవన్ కళ్యాణ్.. మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రులు, కార్యదర్శుల సమావేశానికి కూడా హాజరుకాలేకపోయారు.

# ఏపీలోని ఆ ఉద్యోగులకు శుభవార్త..

## పండగ వేళ ప్రభుత్వం కీలక నిర్ణయం..



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ముస్లింలకు 24 గంటల వ్యవధిలోనే రెండు శుభవార్తలు వినిపించింది. మంగళవారం ఏపీ సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో సీఎం నారా చంద్రబాబు నాయుడు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ముస్లింలకు రంజాన్ తోఫా అందించాలని నిర్ణయించారు. ఆ మేరకు అధికారులను చంద్రబాబు ఆదేశించారు. తాజాగా ముస్లిం ఉద్యోగుల విషయంలో సీఎం చంద్రబాబు మరో నిర్ణయం తీసుకున్నారు. రంజాన్ నేపథ్యంలో ముస్లిం ఉద్యోగులు గంట ముందే ఆఫీసులు, కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లడానికి అనుమతి ఇచ్చారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రంజాన్ నెలలో ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులు గంట ముందే కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లడానికి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మార్చి 2వ తేదీ నుంచి మార్చి 30వ తేదీ వరకూ రంజాన్ మాసం మొత్తం అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ముస్లిం ఉద్యోగులు గంట ముందుగానే ఇళ్లకు వెళ్లేందుకు అవకాశం ఇచ్చారు. ఉపాధ్యాయులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పాటుగా ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు విధులు నిర్వహిస్తున్న ముస్లిం ఉద్యోగులందరికీ వెసులుబాటు కల్పించారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల నేపథ్యంలో ఈ వెసలుబాటు కల్పించింది ఏపీ ప్రభుత్వం. మరోవైపు ముస్లింలకు రంజాన్ తోఫా పథకం అమలు చేయాలని చంద్రబాబు మంగళవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా కింద నిత్యావసర వస్తువులు అందిస్తూ వచ్చారు. ఐదేళ్ల పాటు కొనసాగిన ఈ పథకాలను వైసీపీ హయాంలో నిలిపివేశారు.

అయితే టీడీపీ మరోసారి అధికారంలోకి రావటంతో రంజాన్ తోఫా పథకాన్ని తిరిగి ప్రారంభించాలని చంద్రబాబు నిర్ణయించారు. ముస్లిం మైనారిటీలకు రంజాన్ తోఫాను అందించే ఏర్పాట్లు చేయాలని మంగళవారం ఆదేశించారు. అలాగే ఇమామ్, మౌజమ్‌ల వేతనాల విడుదలపైనా కీలక ఆదేశాలు జారీచేశారు. ఇమామ్, మౌజమ్‌ల వేతనాల విడుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విజయవాడలో హజ్‌హౌస్ నిర్మాణం చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ నిర్ణయాలు తీసుకున్న 24 గంటల్లోనే రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం ఉద్యోగులు త్వరగానే ఇళ్లకు వెళ్లే వెసలుబాటు కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# విజయవాడలో భారీ అగ్నిప్రమాదం.. అదే కారణమా?



విజయవాడ నగరంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సితార సెంటర్ వద్ద కశ్మీర్ జలకన్య ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఎగ్జిబిషన్‌లో బుధవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. భారీగా మంటలు ఎగసి పడ్డాయి. దీంతో ఆ చుట్టుపక్కల ప్రాంతాలలో నివశిస్తున్న ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అగ్ని ప్రమాదం తాలూకు సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే మంటలు ఎగసిపడటానికి షార్ట్ సర్క్యూట్ కారణమని కొంతమంది, సిలిండర్ పేలుడు కారణమని మరికొంతమంది భావిస్తున్నారు. అయితే ప్రమాదానికి గల కారణాలపై పూర్తిగా స్పష్టత రావాల్సి ఉంది.

### ఆర్టీసీ బస్సులో మంటలు..

మరోవైపు ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగి ఇంజిన్ పూర్తిగా కాలిపోయిన ఘటన గుంటూరు జిల్లాలో చోటు చేసుకుంది. గుంటూరు నుంచి పల్నాడు జిల్లాలోని క్రోసూరు వెళు న్న ఆర్టీసీ బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ మంటలు క్షణాల్లో వ్యాపించి ఇంజిన్ పూర్తిగా కాలిపోయింది. అయితే ఈ ఘటనలో.. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం ఉదయం 10 గంటలకు గుంటూరు నుంచి అమరావతి మీదుగా క్రోసూరుకు బస్సు బయల్దేరింది. అయితే ఈ బస్సు అమరావతి మండలం తురకవారిపాలెం సమీపంలోకి రాగానే ఇంజిన్ నుంచి తొలుత పొగలు వచ్చాయి. ఆ తర్వాత మంటలు చెలరేగి ఇంజిన్ పూర్తిగా కాలిపోయింది.

బస్సు ఇంజిన్ నుంచి పొగలు రావటంతో ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తమయ్యారు. ప్రయాణికులను బస్సు నుంచి కిందికి దించేశారు. మంటలు చెలరేగిన సమయంలో బస్సులో 12 మంది ప్రయాణికులు ఉన్నారు. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అనంతరం ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో ఫైరింజన్ సాయంతో వారు మంటలు విస్తరించకుండా చర్యలు తీసుకున్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ సీటు, ఇంజిన్ పూర్తిగా కాలిపోయింది. ఇంజిన్‌లోని వైర్లు షార్ట్ సర్క్యూట్ కావటంతోనే మంటలు చెలరేగినట్లు అధికారులు తెలిపారు.

# అభిషేకానికి పాలూ, నెయ్యి కాదు.. పవన్ సందర్శించిన అగస్త్య మహర్షి ఆలయం విశేషాలివే..

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కేరళలోని అగస్త్య మహర్షి ఆలయాన్ని సందర్శించారు. సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా పవన్ కళ్యాణ్ ఆలయాల సందర్శన చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని ఆలయాలను పవన్ కళ్యాణ్ సందర్శించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం కొచ్చి సమీపంలోని అగస్త్య మహర్షి ఆలయాన్ని పవన్ కళ్యాణ్ సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పవన్ కల్యాణ్‌తో పాటుగా అకీరానందన్, టీటీడీ బోర్డు సభ్యుడు ఆనంద్‌సాయి ఆలయాన్ని సందర్శించారు. పర్యటనలో భాగంగా బుధవారం సాయంత్రం తిరువనంతపురంలోని పరశురామస్వామి ఆలయాన్ని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సందర్శిస్తారు. ఆ తర్వాత అనంత పద్మనాభస్వామి, మధుర మీనాక్షి ఆలయం, స్వామిమలైయ్, అగస్త్య జీవసమాధి, కుంభేశ్వర ఆలయం, తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయాన్ని పవన్ కళ్యాణ్ సందర్శిస్తారు.

### అగస్త్య మహర్షి ఆలయం ప్రత్యేకతలు ఇవే..

ఎర్నాకుళం జిల్లాలోని కురీకాడ్‌లో అగస్త్య ఆలయం కొలువై ఉంది. ఈ ఆలయం వేద జ్ఞానం, ఆయుర్వేద వైద్యానికి నిలయం. ఈ ఆలయ సముదాయంలో మొత్తం 13 చిన్న మందిరాలు ఉన్నాయి. వీటి అన్నింటినీ కలిపి అగస్త్యాశ్రమం అని పిలుస్తారు. ప్రధాన మందిరంలో అగస్త్య మహర్షి ప్రతిమ ఉంటుంది. ఇక్కడ రుషులు, సాధువులు ఎక్కువగా ఉంటారు. అగస్త్య మహర్షి ఆలయంలో విగ్రహాలకు అభిషేకం చేయడానికి పాలు, నెయ్యికి బదులుగా ఔషధ మొక్కల రసాలను ఉపయోగిస్తారు. అలాగే ఔషధ మొక్కలతో చేసిన దండలను విగ్రహాలకు అలంకరిస్తారు. అగస్త్య మహర్షి ఆలయంలో ప్రసాదంగా భక్తులకు చక్కెరలతో చేసిన ప్రసాదం బదులుగా ఆరోగ్యకరమైన మూలికలతో తయారు చేసిన ప్రసాదాన్ని అందజేస్తారు.

సైన్స్, సిద్ధ, ఆయుర్వేద వైద్య విధానాలు వేదాల నుంచి వచ్చాయంటున్న ఇక్కడి ప్రజలు.. వేద గురువుల కోసం ఎలాంటి ఆలయాలను నిర్మించలేదంటున్నారు. అందుకోసమే ప్రస్తుతం, భవిష్యత్ తరాలకు వేద గురువుల గొప్పదనాన్ని తెలుసుకునేలా. వారి ఆశీర్వాదాలను పొందగలిగేలా, వారేం చేశారో అవగాహన కల్పించే స్థలం అవసరమని.. అందుకే అగస్త్య మహర్షి ఆలయం ఏర్పాటు చేసినట్లు చెప్తున్నారు.

అలాగే ఆలయ సముదాయాన్ని కూడా వేదాలలోని నైమిశరణ్యాన్ని సూచించేలా నిర్మించారు. ఈ ఆలయ సముదాయంలో అగస్త్యులు, లోపాముద్ర దేవి, ఔషధ గణపతి, ధన్వంతరి మహర్షి, జ్ఞాన మురుగన్, మార్కండేయ, భరద్వాజ మహర్షి, అత్రి మహర్షి, అనసూయ దేవి, భృగు మహర్షి, అరుంధతి దేవి, వశిష్ట మహర్షి, నారద మహర్షి విగ్రహాలు ఏర్పాటు చేశారు. అగస్త్యాశ్రమంలో ప్రతి శు క్రవారం ఉదయం తాజా మూలికా ఔషధ రసం అందిస్తారు. ఆ రకంగా అగస్త్య మహర్షి ఆలయం ఆధ్యాత్మిక భక్తి, వేద వారసత్వం, సంప్రదాయ వైద్యం అద్భుతమైన కలయికగా చెప్తుంటారు.



# భార్య అనుమతి లేకుండా భర్త అసహజ లైంగిక చర్య నేరం కాదు

## : హైకోర్టు

ఛత్తీస్గఢ్ : భార్య మైనర్ కాకపోతే ఆమె అనుమతి లేకుండా లైంగిక, అసహజ లైంగిక చర్యలు నేరం కాదని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. అత్యాచారం, ఇతర ఆరోపణలపై కింది కోర్టు దోషిగా నిర్ధారించిన ఒక వ్యక్తిని నిర్దోషిగా పేర్కొంది. అతడ్ని వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది.

### భార్య అనుమతి లేకుండా భర్త అసహజ లైంగిక చర్య నేరం కాదు: హైకోర్టు

రాయ్‌పూర్: భార్య మైనర్ కాకపోతే ఆమె అనుమతి లేకుండా లైంగిక, అసహజ లైంగిక చర్యలు నేరం కాదని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. అత్యాచారం, ఇతర ఆరోపణలపై కింది కోర్టు దోషిగా నిర్ధారించిన ఒక వ్యక్తిని నిర్దోషిగా పేర్కొంది. అతడ్ని వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది. 2017 డిసెంబర్ 11న బస్తర్ జిల్లాలోని జగదల్‌పూర్‌కు చెందిన వ్యక్తిపై అతడి భార్య పలు ఆరోపణలు చేసింది. తన అంగీకారం లేకుండా అసహజ శృంగారం చేశాడని, దీంతో కడుపులో నొప్పిగా ఉండటంతోపాటు అనారోగ్యం పాలైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పరిస్థితి సీరియస్‌గా ఉన్న ఆమె ఎగ్జిక్యూటివ్ మెజిస్టేట్ ముందు ఈ మేరకు మరణ వాంగ్మూలం ఇచ్చింది. అనారోగ్యంతో అదే రోజు మరణించింది.

కాగా, ఆ మహిళ స్టేట్‌మెంట్ ఆధారంగా ఆమె భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు. 2019 ఫిబ్రవరి 11న జగదల్‌పూర్‌లోని అదనపు సెషన్స్ (ఫాస్ట్ ట్రాక్ కోర్టు) జడ్జి ఆ వ్యక్తిని దోషిగా నిర్ధారించారు. పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. దీంతో కోర్టు తీర్పును బిలాస్‌పూర్‌లోని హైకోర్టులో ఆ వ్యక్తి సవాల్ చేశాడు. అతడికి వ్యతిరేకంగా చట్టపరంగా ఆమోదయోగ్యమైన ఆధారాలు లేవని ఆ వ్యక్తి తరుపు న్యాయవాది కోర్టులో వాదించారు. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగానే దిగువ కోర్టు దోషిగా నిర్ధారించి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

మరోవైపు ఆ మహిళ మొదటి ప్రసవం తర్వాత ఫైల్స్‌తో బాధపడుతున్నదని, దీని కారణంగా ఆమెకు రక్తస్రావం, కడుపులో నొప్పి వచ్చేదని న్యాయవాది కోర్టుకు చెప్పాడు. ఇద్దరు సాక్షుల వాంగ్మూలాలను ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని అన్నారు. అయితే ఆ అప్పీల్‌ను తిరస్కరించాలని ప్రభుత్వం తరుపు న్యాయవాది వాదించారు.

కాగా, ఐపీసీలోని 375, 376, 377 సెక్షన్లను హైకోర్టు పరిశీలించింది. 375 సెక్షన్‌కు సవరించిన నిర్వచనం దృష్ట్యా, భార్యాభర్తల మధ్య ఐపీసీ 377 సెక్షన్ కింద నేరానికి స్థానం లేదని, అలాంటి అత్యాచారాన్ని నిరూపించలేమని కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తిని నిర్దోషిగా ప్రకటించింది. అతడ్ని జైలు నుంచి విడుదల చేయాలని ఆదేశించింది. గత ఏడాది నవంబర్ 19న రిజర్వ్ చేసిన ఈ తీర్పును ఫిబ్రవరి 10న జస్టిస్ నరేంద్ర కుమార్ వెలువరించారు.



# విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి



**నర్సింహులపేట, 12 ఫిబ్రవరి. (క్రాంతిన్యూస్ ):** నర్సింహులపేట మండలం లోని రామన్నగూడెం గ్రామానికి చెందిన దుండి ఉప్పలయ్య(45) గ్రామానికి సమీపంలోని వెంకమ్మ చెరువు మత్తడి దగ్గరలోని ఓ గుంతలో కరెంట్ తో చేపలు పట్టే క్రమంలో కరెంట్ వైరుకు ఉన్న డ్యామేజీని సరిగా చుసుకోక పోవడం వల్ల షాక్ గురి కావడంతో మృతి చెందాడు. మృతి చెందిన ఉప్పలయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారని, అతనికి మృతుని భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సురేష్ తెలిపారు.



# కోళ్ల పెంపకం పట్ల జాగ్రత్తలు తప్పని సరి ఫామ్ లో కోళ్లు చనిపోతే తప్పని సరిగా సమాచారం ఇవ్వాల్సిందే

## -పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు



**నేలకొండపల్లి,12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):** కోళ్ల పెంపకం పట్ల నిర్వహకులు జాగ్రత్తలు తప్పనిసరిగా చేపట్టాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఆర్.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక తహశీల్ కార్యాలయంలో కోళ్ల ఫామ్ నిర్వహకులతో బుధవారం అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.కోళ్లకు వస్తున్న వైరస్ వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న కోళ్లను తీసుకోవద్దని అన్నారు. ఏ కారణం చేతనైనా ఫామ్ లో కోళ్లు చనిపోతే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఫామ్ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ప్రజలు కూడ కోళ్ల ను తక్కువ ధరకు వస్తున్నాయనిసూచించారు. ఫామ్ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ప్రజలు కూడ కోళ్ల ను తక్కువ ధర కు వస్తున్నాయని తీసుకోవద్దని సూచించారు. ఇతర వ్యక్తులను కోళ్ల ఫామ్లోకి రాకుండా చూడాలని అన్నారు. అలాగే ఫామ్లో పని చేసే వారు చాలా వరకు బయటకు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం ఆదేశాలను నిర్వహకులు తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె. మానిక్ వ్, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఆలస్యం మధుసూదన్ రావు, పశు సంవర్ధక శాఖ వైద్యాధికారులు భువనేశ్వర్, సాహితీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై అవగాహన




**ఇనుగుర్తి, 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):** ఇనుగుర్తి మండలం లోని అయ్యగారి పల్లి గ్రామం లో పెండం వెంకన్న వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ వ్యవసాయంపై వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో భాగంగా జీవామృతం ను తయారు చేయుట దానిని పంటల సాగులో వినియోగం, దేశీయ విత్తనాలకు రసాయన ఎరువులు వాడకుండా పంటలను పండించడం గూర్చి విద్యార్థులకు తెలియ పరిచారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# సర్వోత్తమ్ రావు దశ దిన కర్మ కు హాజరైన మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మదేవేందర్ రెడ్డి



**మెదక్, 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):** హవెలిఘనపూర్ మండలం సర్ధన గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వారియర్ రాజేశ్వరరావుతండ్రి సర్వోత్తమ్‌రావు ఇటీవల మృతి చెందాడు. బుధవారం రోజు సర్వోత్తమ్‌రావు దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ శాసనసభ్యురాలు యం. పద్మ దేవేందర్‌రెడ్డి. వీరి వెంట బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు యం. దేవేందర్‌రెడ్డి, తాజా మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు యం. లావణ్య రెడ్డి, హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు. సిహెచ్. శ్రీనివాస్‌రెడ్డి, తాజా మాజీ వైస్. ఎంపీపీ రాధాకృష్ణయాదవ్, నాయకులు సతీష్‌రావు, సత్యవర్ధన్‌రావు, మ్యాకల. సాయిలు, రామచంద్ర రెడ్డి, నరేందర్‌రెడ్డి, సాప. సాయిలు, వినయ్, రంజిత్, లద్దు నాయక్ తదితరులు ఉన్నారు.

# ఎస్ఆర్ ఎస్పి కెనాల్‌లో మృత దేహం లభ్యం

**పర్వతగిరి,12ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):** బుధవారం సాయంత్రం ఆరు గంటలకి తీగరాజు పల్లెలోని ఎస్సారెస్పీ కెనాల్ గేటు వద్ద ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం నీటిలో కొట్టుకొని వచ్చి ఆగిందని ఇట్టి మృతదేహాన్ని ఎవరైనా గుర్తుపట్టినచో పర్వతగిరి పోలీస్ స్టేషన్ నెంబర్ 8712685242,871268508 నెంబర్లకి కాల్ చేసి సమాచారం అందించగలరని దానిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ భోగం ప్రవీణ్ తెలిపారు.

# కూడా చైర్మన్ కు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆహ్వాన పత్రిక అందజేసిన మాజీ జడ్పీటీసీ



**సంగెం, 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):** సంగెం మండల కేంద్రంలో ఈనెల 15న బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ గుగులోతు వీరమ్మ సేవాలాల్ మహారాజ్ జయంతి ఆహ్వాన పత్రికను ఈరోజు కూడా కార్యాలయంలో చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డిని కలిసి అందజేశారు. వీరమ్మ మాట్లాడుతూ... ఈ నెల 15న సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా అందరూ తప్పకుండా రావాలని కోరారు.

# కులగణన సర్వే అశాస్త్రీయంగా జరిగిందని, తప్పులతడకగా ఉందని సరైన లెక్కలు వెల్లడించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎంపీ వద్దిరాజు



**ఖమ్మం,12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):** కులగణన సర్వే అశాస్త్రీయంగా జరిగిందని, తప్పులతడకగా ఉందని తమ పార్టీ లెక్కలతో సహా నిరూపించడంతో రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చి రీసర్వేకు అంగీకరించడాన్ని భారత రాష్ట్ర సమితి బీ.ఆర్.ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర స్వాగితించారు.ఈసారైనా ఎన్యూమరేట్స్ ఇంటింటికి వెళ్లి పూర్తి వివరాలు సేకరించాలని, వాటన్నింటిని క్రోడీకరించి సరైన లెక్కలు వెల్లడించాలని ఒక ప్రకటనలో ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓబీసీలకు చట్ట సభల్లో 33% రిజర్వేషన్స్ కల్పించడంతో పాటు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ మొదటి నుంచి డిమాండ్ చేస్తున్నదని. రాష్ట్ర ఏర్పాటు జరిగిన తొలి నాళ్లలోనే ఈమేరకు మహానేత కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేయించడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు.బీఆర్ఎస్ చేసిన తీర్మానానికి అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అఖిల పక్షాన్ని ప్రధాని నరేంద్రమోడీ వద్దకు తీసుకెళ్లి చట్టసభల్లో 33%, స్థానిక సంస్థల ఎన్నికలలో 42 రిజర్వేషన్స్ బిల్లును పార్లమెంటులో ఆమోదింప జేసేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించాలని ఎంపీ వద్దిరాజు కోరారు. అలాగే, ఓబీసీల సమగ్రాభివృద్ధికి కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాల్సిందిగా ప్రధానికి విజ్ఞప్తి చేయాలని సలహానిచ్చారు. మంత్రి మండలిలో ఖాళీగా ఉన్న ఆరు స్థానాలలో నాలుగింటిని బీసీలకిచ్చి ప్రాధాన్యత శాఖలు కేటాయించాలని ఎంపీ వద్దిరాజు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు.

# స్వీట్ హౌస్ ను ప్రారంభించిన

## ఓలం చంద్రమోహన్, అల్లం నాగేశ్వరరావు, చిలువేరు సమ్మయ్య గౌడ్



**కేసముద్రం, 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):** కేసముద్రం మున్సిపాలిటీలోని పొట్టి శ్రీరాములు సెంటర్ లో శ్రీ మహదేవ్ స్వీట్ హౌస్, టిఫిన్ సెంటర్ ను మంగళవారం కేసముద్రం మండల మాజీ ఎంపీపీ ఓలం చంద్రమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రజల అభిరుచులకు తగ్గట్టుగా నాణ్యమైన రుచికరమైన స్వీట్ లను అందించాలన్నారు. ఉప్పరపల్లి రోడ్ లో ఏర్పాటు చేసిన ఈ స్వీట్ హౌస్ ను మండల ప్రజలు వినియోగించు కోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వరరావు,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్,బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గూగులోత్ వీరు నాయక్, ఎండి అయూబ్ ఖాన్,నర్సింగం వేంకటేశ్వర్లు, మహేశ్వరచారి, బండారు గోపీనాథ్,నవాజ్ కిరణ్,తారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.


# కేసీఆర్ హయాంలో క్రీడలకు పెద్దపీట



**హనుమకొండ, 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):** హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో కేసీఆర్ క్రికెట్ కప్ 2025 టోర్నీని బుధవారం రోజున ప్రారంభించారు కాగా 10 వ డివిజన్ 61వ డివిజన్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డా. బండ ప్రకాశ్ మాట్లాడుతూ స్వరాష్ట్రం ఏర్పడిన పది సంవత్సరాలలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తెలంగాణలో క్రీడలకు పెద్దపీట వేశారని అన్నారు. క్రీడాకారులకు ప్రోత్సాహకాలు, నగదు బహుమతులు, ఇంటి స్థలాలు అందించిన ఘనత కేసీఆర్‌దే అని తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడలను బలోపేతం చేసేందుకు గత బీఆర్ఎస్ హయాంలో క్రీడా మైదానాలను సైతం ఏర్పాటు చేశామని గుర్తు చేశారు.తెలంగాణ నుంచి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణిస్తున్నారని, వారందరిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారుక్రీడలతో విద్యార్థుల్లో శక్తి సామర్థ్యాలు పెంపొందుతామని అన్నారు. దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో కేసీఆర్ క్రికెట్ కప్ పోటీలను కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారని, అభినందనీయమని అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ క్రీడాకారులను ఈ పోటీల ద్వారా ప్రోత్సాహం అందించినట్లవుతుందని కొనియాడారు. ఉద్యమ నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరధిలో వివిధ క్రీడాపోటీలను నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. హనుమకొండ జిల్లా, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ప్రతీ సంవత్సరం క్రికెట్ పోటీలను నిర్వహించడం జరుగుతోందని అన్నారుక్రీడల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, పోటీతత్వం, గెలుపోటములను సమానంగా స్వీకరించే గుణాలుపెంపొందుతాయని వివరించారు. ఓరుగల్లు క్రికెట్ క్రీడాకారులను ప్రపంచానికి పరిచయం చేసేందుకు కాకతీయ క్రికెట్ అకాడమీతో కలసి కేసీఆర్ క్రికెట్ కప్ నిర్వహించడం జరుగుతోందని తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడలకు, క్రీడాకారులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు దాస్యం విజయ్ భాస్కర్ కార్పొరేటర్లు చెన్నం మధు, బోయినపల్లి రంజిత్ రావు, పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, డివిజన్

# నిద్రలో కాళ్లు పట్టేస్తున్నాయా?

హెల్త్ న్యూస్ , 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): కొందరికి రాత్రిపూట నిద్రలోనే కాళ్లు పట్టేస్తుంటాయి. భరించలేని నొప్పిని కలగజేస్తాయి. ముఖ్యంగా మహిళల్లో ఇలాంటి సమస్యలు తరచుగా కనిపిస్తుంటాయి. ఈ సమస్య రావడానికి గల కారణాలను ఆరోగ్య నిపుణులు వెల్లడిస్తున్నారు. ఇవి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు .



నిద్రలో కాళ్లు పట్టేయడానికి 'డీహైడ్రేషన్' ఓ కారణం. శరీరంలో ఎలక్ట్రోలైట్ అసమతుల్యత వల్ల కండరాలు తీవ్రంగా ప్రభావితం అవుతాయి. దీనివల్ల తిమ్మిర్లు, కాళ్లు పట్టేయడం లాంటి సమస్యలు ఎదురవుతాయి. మానసిక ఒత్తిడి కూడా.. కండరాల నొప్పిని కలిగిస్తుంది. శారీరక శ్రమ ఎక్కువైనా, వ్యాయామం చేసినా.. కండరాలు అలసిపోయి రాత్రిళ్లు కాళ్లు పట్టేస్తాయి. ముఖ్యంగా.. గర్భిణులలో ఈ లెగ్ క్రాంప్స్ ఎక్కువగా కనిపిస్తుంటాయి. మూడో నెల నుంచి ఆరో నెల మధ్యలో.. చీటికీమాటికీ కాళ్లు పట్టేసి ఇబ్బంది కలిగిస్తుంటాయి. మధుమేహం, మూత్రపిండాల సమస్యలు, థైరాయిడ్, నరాల రుగత్మలు కూడా లెగ్ క్రాంప్స్ రావడానికి కారణం అవుతాయి.

నివారణ చర్యలు

డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండేందుకు తగినంత నీటిని తీసుకోవాలి. పడుకునేముందు కాసేపు కాళ్లను స్ట్రెచ్ చేయాలి. దీనివల్ల కండరాలు స్వేచ్ఛగా కదులుతాయి. లెగ్ క్రాంప్స్‌తోపాటు కండరాల నొప్పులు కూడా దూరమవుతాయి.నిద్రలో కాళ్లు పట్టేస్తే.. కాలిని సాగదీసి ఉంచాలి. కొంతసేపు నిల్చున్నా.. నొప్పి తగ్గుతుంది. లెగ్ క్రాంప్స్ నిత్యం వేధిస్తుంటే.. హీట్ ప్యాడ్స్ వాడటం మంచిది. ఇక వేడి నీటి స్నానం కూడా లెగ్ క్రాంప్స్‌ను తరిమేస్తుంది. వేడినీళ్ల వల్ల కండరాలు రిలాక్స్ అవుతాయి. ఎక్కువగా నొప్పి పుట్టే ప్రాంతంలో మసాజ్ చేసుకున్నా.. ఉపశమనం లభిస్తుంది.

# మొబైల్, రిమోట్ పైనా క్రిములు - అలా పైపైన కడిగి వదిలిస్తే రోగాలు తప్పవట!



హెల్త్ న్యూస్ , 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): మన చేతులను పరిశుభ్రంగా ఉంచుకుంటే అనేక రోగాల నుంచి తప్పించుకోవచ్చని చాలా మందికి తెలుసు. అయినా సరే- ఈ విషయంలో ఒక్కోసారి అశ్రద్ధ వహిస్తుంటాం. ముఖ్యంగా బయటి నుంచి వచ్చాక, ఆహారం తీసుకునే ముందు జస్ట్ అలా నీళ్లు పోసుకుని పైపైన చేతులు కడుక్కుంటాం. అయితే, ఇలా చేయడం వల్ల చేతులకు అంటుకున్న క్రిములు, బ్యాక్టీరియా మనం తీసుకునే ఆహారం ద్వారా మన శరీరంలోకి చేరతాయట! ఫలితంగా సమస్త ఆరోగ్య సమస్యలకు ఇక్కడే బీజం పడుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే చేతుల శుభ్రత విషయంలో ఏమాత్రం అజాగ్రత్త పనికి రాదని సలహా ఇస్తున్నారు.

ఓ అధ్యయనం ప్రకారం సరిగ్గా చేతులు కడుక్కోకపోవడం వల్ల ఏటా పది లక్షల మంది వివిధ అనారోగ్యాలతో ప్రాణాలు కోల్పోతున్నారని తేలింది.చేతులను సరిగ్గా శుభ్రం చేసుకోకపోతే చేతిపై ఉన్న వ్యాధికారక క్రిములన్నీ మనం తీసుకునే ఆహారం ద్వారా శరీరంలోకి వెళతాయి. ఇంకా ఈ అపరిశుభ్ర చేతులతోనే ఇతరులను తాకితే వారికి కూడా ఆ క్రిములన్నీ అంటుకుంటాయి.ఇక మొబైల్, టీవీ రిమోట్, తలుపులు, కిటికీలు, డైనింగ్ టేబుల్‌పై కూడా వ్యాధికారక క్రిములుంటాయి. ఒక టాయిలెట్ కమోడ్ పైనే లక్షల సంఖ్యలో క్రిములు దాగి ఉంటాయని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. కాబట్టి కచ్చితంగా తరచూ చేతులు శుభ్రం చేసుకోవడం వల్ల మీతో పాటు మీ కుటుంబ సభ్యులు కూడా ఆరోగ్యంగా ఉంటారు.ముఖ్యంగా చేతులు పరిశుభ్రంగా లేకపోవడం వల్ల డయేరియా, హెపటైటిస్, జలుబు వంటి వివిధ రకాల అనారోగ్యాలు తలెత్తే అవకాశాలు ఎక్కువని నిపుణులు చెబుతున్నారు.చేతులు అపరిశుభ్రంగా ఉండడం వల్ల ప్రమాదకర కంటి సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి సబ్బు, హ్యాండ్‌వాష్, శానిటైజర్‌తో కనీసం 20 సెకన్ల పాటు చేతులు శుభ్రం చేసుకుంటే ఇలాంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని సూచిస్తున్నారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ : ముఖ్యంగా చిన్నారులు, ఇంకా స్కూలుకు వెళ్లే పిల్లల ఆరోగ్యంపై వారి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పిల్లల చేతులు శుభ్రంగా లేకపోతే వారికి జీర్ణ సంబంధ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. డయేరియా లాంటి అతిసార వ్యాధుల కారణంగా ఏటా సుమారు 1.8 మిలియన్ల మంది చిన్నారులు మరణిస్తున్నారు. అందులో ఐదేళ్ల లోపు చిన్నారులు ఎక్కువగా ఉంటున్నారు. పిల్లల చేతులు పరిశుభ్రంగా ఉంచడం వల్ల 10 మంది చిన్నారుల్లో కనీసం నలుగురు చిన్నారులను ఈ వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని అధ్యయనాలు వివరిస్తున్నాయి. 2017 Journal of Infectious Diseasesలో ప్రచురితమైన "Hand Hygiene and Diarrheal Disease" అనే అధ్యయనంలో ఈ విషయం తేలింది.

# వీటితో ఊపిరితిత్తుల్ని విషపూరితగాలి నుంచి రక్షించుకోండి

హెల్త్ న్యూస్ , 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):కాలుష్యం విపరీతంగా పెరిగింది. ఢిల్లీ, హైదరబాద్ వంటి నగరాలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. ఈ కాలుష్యం కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం 10 రెట్లు పెరిగింది. పిల్లలు, వృద్ధులు కాలుష్యం వల్ల



త్వరగా ఎఫెక్ట్ అవుతారు. వేగంగా పెరుగుతున్న కాలుష్యం ప్రజలకు ఆందోళన కలిగించే అంశంగా మారింది. ముఖ్యంగా కాలుష్యం వల్ల కళ్ల మంట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు.అందుకే కాలుష్యం బారిన పడకుండా ఉండాలంటే ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. మన శరీరాన్ని నిర్విషీకరణ చేయడం సాయపడే కొన్ని డ్రింక్స్ ఆహారంలో భాగమవ్వాలి. ఈ సూపర్ డ్రింక్స్ రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అంతేకాకుండా ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. వాయు కాలుష్యం నుంచి ఊపిరితిత్తుల్ని కాపాడటమే కాకుండా.. ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఆ సూపర్ డ్రింక్స్ ఏంటో ఓ లుక్కేద్దాం.

తులసి నీరు..

తులసి ఆకులు అనేక వ్యాధులతో పోరాడగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు శరీరంలోని టాక్సిక్ ఎలిమెంట్స్ ను తొలగించడంలో సహాయపడతాయి. రోజూ ఉదయాన్నే తులసి నీటిని తాగడం వల్ల ఊపిరితిత్తులు శుభ్రపడతాయి. ఈ నీరు పిల్లలు, వృద్ధులు కూడా తాగవచ్చు. వారికి ఎంతో సురక్షితం తులసి నీరు.

బీట్‌రూట్ జ్యూస్..

రక్తహీనత ఉన్నవారు బీట్‌రూట్ తినడం మంచిది. ఇది రక్తహీనతను దూరం చేయడమే కాకుండా ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇక, బీట్‌రూట్ జ్యూస్ ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపరుస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, నైట్రేట్లు పుష్కలంగా ఉన్నాయి. దీంతో లంగ్స్ హెల్త్ మెరగవుతుంది. అంతేకాకుండా ఆక్సిజన్ స్థాయిలు మెరుగుపడతాయి. అందుకే కాలుష్యం బారిన పడకుండా ఉండాలంటే బీట్‌రూట్ జ్యూస్ తాగాలని నిపుణులు చెబుతున్నారు.

గ్రీన్ టీ..

గ్రీన్ టీలో కాటెచిన్స్, పాలీఫెనాల్స్ పుష్కలంగా లభిస్తాయి. ఇవి మన శరీరంలోని హానికరమైన పదార్థాలను తొలగించడంలో సహాయపడతాయి. గ్రీన్ టీ తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంతేకాకుండా, ఇది మన ఊపిరితిత్తులను శుభ్రంగా ఉంచడంలో కూడా గ్రీన్ టీ బెస్ట్ ఆప్షన్. ఇలాంటి పరిస్థితుల్లో వాయు కాలుష్యాన్ని నివారించడానికి గ్రీన్ టీని తప్పనిసరిగా తాగాలి.

పసుపు పాలు..

శరీరంలోని అంతర్గత భాగాలలో పేరుకుపోయిన టాక్సిన్స్ తొలగించడంలో పసుపు సహాయపడుతుంది. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేషన్ లక్షణాలు ఉన్నాయి. రాత్రి పడుకునే ముందు పసుపు పాలు తాగితే ఊపిరితిత్తులు దృఢంగా మారుతాయి. అదనంగా, రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. దగ్గు, జలుబు ఉన్నవారు పసుపు పాలు తాగితే మంచి ఫలితాలు ఉంటాయి.

ఉసిరి జ్యూస్..

ఉసిరిలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఉసిరి జ్యూస్ హానికరమైన కాలుష్య కారకాల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. దీన్ని తాగడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. లంగ్స్ పనితీరు మెరగవుతుంది. ఉసిరి రసం పిల్లలకు, వృద్ధులకు చాలా మేలు చేస్తుంది. ఉసిరి రసం తాగడం వల్ల జుట్టు, చర్మ ఆరోగ్యం కూడా మెరగవుతుంది.

కలబంద రసం..

అలోవెరా శరీరాన్ని డిటాక్సిఫై చేయడంలో బాగా సహాయపడుతుంది. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీరంలో మంటను తగ్గిస్తాయి. వాయు కాలుష్యం ప్రభావం నుంచి ఊపిరితిత్తులను రక్షించడానికి కలబంద రసాన్ని ప్రతిరోజూ తాగవచ్చు.

తిప్పతీగ రసం..

తిప్పతీగ లేదా గిలోయ్ జ్యూస్ శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఇది వాయు కాలుష్యం వల్ల వచ్చే ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుంది. గిలోయ్ రసంలో యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి ఊపిరితిత్తుల్ని బలంగా మారుస్తాయి. కాలుష్య ప్రభావాన్ని తగ్గిస్తుంది.

# భారత్ భారీ విజయం..
## ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ క్లీన్ స్వీప్




స్పోర్ట్స్ న్యూస్ , 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ఇంగ్లాండ్‌తో 3 వన్డేల సిరీస్‌ను భారత్ క్లీన్ స్వీప్ చేసింది. బుధవారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన మూడో వన్డేలో 142 పరుగుల తేడాతో భారత జయభేరీ మోగించింది. ఇప్పటికే సిరీస్‌లో తొలి రెండు వన్డేల్లో టీమిండియా గెలుపొందిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. 356 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం ఇంగ్లాండ్‌ను 214 పరుగులకు కుప్పకూల్చింది. కాగా వన్డే సిరీస్‌కు ముందు భారత్.. టీ20 సిరీస్‌ను సైతం 4-1తో కైవసం చేసుకుంది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లాండ్ కెప్టెన్ బట్లర్.. తొలుత భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. ఈ సిరీస్‌లో తొలిసారి ఫస్ట్ బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా.. ఆకాశమే హద్దుగా చెలరేగిపోయింది. ముఖ్యంగా ఓపెనర్ శుభ్‌మన్ గిల్ సెంచరీతో సత్తాచాటాడు. శ్రేయస్ అయ్యర్ (78), విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ (40) కూడా రాణించారు. దీంతో భారత్.. నిర్ణీత 50 ఓవర్లలో 356 పరుగులకు ఆలౌట్ అయింది. ఇంగ్లాండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్ 4 వికెట్లు, మార్క్‌వుడ్ 2, సాకిబ్ మహమూద్, గస్ అట్కిన్సన్, జో రూట్‌లు తలా ఒక వికెట్ తీశారు.

అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్.. ధాటిగా ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. ఓ దశలో 6.1 ఓవర్లలో 60/0తో నిలిచింది. దీంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. కానీ బెన్ డకెట్ (34)ను ఔట్ చేయడం ద్వారా అర్షదీప్ సింగ్ వికెట్ల వేటను ప్రారంభించాడు. ఆ తర్వాత మిగతా బౌలర్లు కూడా కట్టుదిట్టంగా బంతులేయడంతో ఇంగ్లీష్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. చివరకు 34.2 ఓవర్లలో ఇంగ్లాండ్.. 214 పరుగులకు ఆలౌట్ అయింది. 142 పరుగుల తేడాతో భారత్ జయభేరీ మోగించింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డులను శుభ్ మన్ గిల్ కైవసం చేసుకున్నాడు.


భారత బౌలర్లలో అర్షదీప్ సింగ్, హర్షిత్ రాణా, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యాలు రెండేసి వికెట్లు చొప్పున తీశారు. వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్‌లు ఒక్కో వికెట్ పడగొట్టారు. ఇక ఈ ఫలితంతో వన్డే సిరీస్‌ను భారత్ 3-0తో కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌కు ముందు జరిగిన టీ20 సిరీస్‌ను కూడా భారత్ 4-1తో గెలుపొందింది. ఈ పర్యటనలో మొత్తంగా 8 మ్యాచ్‌లు ఆడిన ఇంగ్లాండ్.. కేవలం ఒకే టీ20లో గెలిచింది.

# 36వసారి జాతీయ టైటిల్
## సాధించిన పంకజ్ అద్వానీ

స్పోర్ట్స్ న్యూస్ , 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):భారత స్టార్ క్యూయిస్ట్, ప్రపంచ చాంపియన్ పంకజ్ అద్వానీ తన ఖాతాలో 36వసారి జాతీయ టైటిల్‌ను జమ చేసుకున్నాడు. మంగళవారం జరిగిన 91వ జాతీయ స్నూకర్ చాంపియన్‌షిప్ ఫైనల్లో పంకజ్ 5-1 ఫ్రేమ్‌ల తేడాతో బ్రిజేశ్ దమానిపై నెగ్గాడు. ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ఆసియా స్నూకర్ చాంపియన్‌షిప్‌లో పంకజ్‌తో పాటు బ్రిజేశ్ జాతీయ జట్టు తరఫున ఆడే అవకాశం దక్కించుకున్నారు. 'అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనే అవకాశం ఇచ్చే ఈవెంట్ ఇదొక్కటే కావడంతో... తీవ్ర పోటీ ఎదురైంది. గ్రూప్ దశలో పేలవ ప్రదర్శన అనంతరం తిరిగి పుంజుకొని స్వర్ణం నెగ్గడం ఆనందంగా ఉంది. అంతర్జాతీయ వేదికపై దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం లభించినందుకు సంతోషంగా ఉంది' అని పంకజ్ అన్నాడు.



# శుబ్‌మన్ గిల్ ప్రపంచ రికార్డు




స్పోర్ట్స్ న్యూస్ , 12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): టీమిండియా యువ ఓపెనర్, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సూపర్ సరికొత్త చరిత్ర లిఖించాడు. వన్డేల్లో సౌతాఫ్రికా బ్యాటర్ హషీం ఆమ్లా పేరిట ఉన్న ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. ఇంగ్లాండ్‌తో మూడో వన్డే సందర్భంగా శతకం బాదిన 'ప్రిన్స్' ఈ ఘనత సాధించాడు.

కాగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025కి ముందు టీమిండియా స్వదేశంలో ఇంగ్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడుతోంది. ఇందులో భాగంగా తొలుత నాగ్‌పూర్‌లో నాలుగు వికెట్ల తేడాతో పర్యాటక జట్టును ఓడించిన రోహిత్ సేన.. కటక్‌లో జరిగిన రెండో వన్డేలోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేసింది. తద్వారా సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది.

**గిల్ సూపర్ సెంచరీ**

ఈ క్రమంలో ఇరుజట్ల మధ్య అహ్మదాబాద్ వేదికగా నామమాత్రపు మూడో వన్డేలోనూ గెలిచి క్లీన్‌స్వీప్ చేయాలనే లక్ష్యంతో ఉంది. నరేంద్ర మోదీ స్టేడియంలో బుధవారం నాటి ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిన భారత జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగింది. అయితే, గత మ్యాచ్‌లో శతకం(119) బాదిన కెప్టెన్, ఓపెనర్ రోహిత్ శర్మ(1) ఈసారి విఫలం కాగా.. మరో ఓపెనర్ శుబ్‌మన్ గిల్ మాత్రం సెంచరీతో మెరిశాడు.

**తొలి యాభై ఇన్నింగ్స్‌లో**

మొత్తంగా 102 బంతులు ఎదుర్కొని 112 పరుగులు సాధించాడు. గిల్ ఇన్నింగ్స్‌లో ఏకంగా పద్నాలుగు ఫోర్లతో పాటు మూడు సిక్సర్లు ఉన్నాయి. ఈ క్రమంలోనే గిల్ హషీం ఆమ్లాను అధిగమించాడు. వన్డేల్లో ఆడిన తొలి యాభై ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా ప్రపంచ రికార్డు సృష్టించాడు.

అంతేకాదు.. ఒకే వేదికపై మూడు ఫార్మాట్లలో శతకం బాదిన ఐదో బ్యాటర్‌గానూ శుబ్‌మన్ గిల్ చరిత్రకెక్కాడు. ఇక ఇంగ్లండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ బౌలింగ్‌లో బౌల్డ్ కావడంతో మూడో వన్డేలో గిల్ సెంచరీ ఇన్నింగ్స్‌కు తెరపడింది.

**కోహ్లి కూడా ఫామ్‌లోకి**

ఇక ఈ మ్యాచ్‌తో మరో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి కూడా ఫామ్‌లోకి వచ్చాడు. అహ్మదాబాద్‌లో 55 బంతులు ఎదుర్కొని ఏడు ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 52 పరుగులు సాధించాడు. మరోవైపు.. నాలుగో నంబర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ కూడా అద్భుత హాఫ్ సెంచరీ(64 బంతుల్లో 78)తో మెరిశాడు.

ఇదిలా ఉంటే.. 2019లో టీమిండియా తరఫున అరంగేట్రం చేసిన శుబ్‌మన్ గిల్ ఇప్పటి వరకు 50 వన్డేలు, 32 టెస్టులు, 21 టీ20లు ఆడాడు. వరుసగా ఆయా ఫార్మాట్లలో 2587, 1893, 578 పరుగులు చేశాడు.

అంతర్జాతీయ స్థాయిలో వన్డేల్లో తొలి యాభై ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్లు

శుబ్‌మన్ గిల్(ఇండియా)- 2587 పరుగులు

హషీం ఆమ్లా(సౌతాఫ్రికా)- 2486 పరుగులు

ఇమామ్ ఉల్ హక్(పాకిస్తాన్)- 2386 పరుగులు

ఫఖర్ జమాన్(పాకిస్తాన్)- 2262 పరుగులు

షాయీ హోప్(వెస్టిండీస్)- 2247 పరుగులు

ఒకే వేదికపై వన్డే, టెస్టు, టీ20 ఫార్మాట్లలో శతకం బాదిన క్రికెటర్లు

ఫాఫ్ డుప్లెసిస్(సౌతాఫ్రికా)- వాండరర్స్ స్టేడియం, జొహన్నస్‌బర్గ్

డేవిడ్ వార్నర్(ఆస్ట్రేలియా)- అడిలైడ్ ఓవల్, అడిలైడ్

బాబర్ ఆజం(పాకిస్తాన్)- నేషనల్ స్టేడియం, కరాచి

క్వింటన్ డికాక్(సౌతాఫ్రికా)- సూపర్‌స్పోర్ట్ పార్క్, సెంచూరియన్

శుబ్‌మన్ గిల్(ఇండియా)- నరేంద్ర మోదీ స్టేడియం(మొతేరా), అహ్మదాబాద్.

# కోటి ఇచ్చిన గ్లామర్ పాత్రలు చేయను

మూవీ న్యూస్ ,12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): దక్షిణాది ప్రేక్షకులకు పరిచయం అవసరంలేని హీరోయిన్.. మలయాళీ సినీపరిశ్రమలో ఆమె నటించింది తక్కువ సినిమాలే అయినప్పటికీ తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. పెళ్లి తర్వాత సినిమాలకు దూరంగా ఉంటున్న ఆమె.. ఇప్పుడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా సందడి చేస్తుంది. అయితే తనకు రూ.కోటి ఇచ్చినప్పటికీ గ్లామర్ పాత్రలు చేయనని చెప్పుకొచ్చింది. ఆమె మరెవరో కాదు.. హీరోయిన్ సంవృత సునీల్. ఈ అమ్మాయి తెలుగు ప్రేక్షకులకు అంతగా పరిచయం లేదు. కానీ మలయాళీ ఇండస్ట్రీలో చాలా ఫేమస్. 1998లో వచ్చిన 'అయాల్ కథ ఎతువుక్కు' సినిమాలో చిన్న పాత్ర పోషించినప్పటికీ, సంవృత 2004లో వచ్చిన 'రసికన్' సినిమాలో హీరోయిన్‌గా అరంగేట్రం చేసింది. ఆ ఒక్క సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది.




ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సంవృత సునీల్ మాట్లాడుతూ.. " కోటి రూపాయలు పారితోషికం ఇచ్చినా గ్లామరస్ పాత్రలు చేయను. డబ్బు లేదా కీర్తి కంటే శాంతి, ఆనందం వీటిని ఎక్కువగా విలువైనదిగా భావిస్తాను. అందరుక నాకు గౌరవం ఇస్తారు. ఇప్పుడు దానిని కోల్పోవాలని నేను కోరుకోవడం లేదు. నేను సూపర్ స్టార్ హెూదాను కోరుకోవడం లేదు. నా కుటుంబం, స్నేహితులు అందరూ నా సినిమాల గురించి చాలా గర్వంగా మాట్లాడుకుంటారు. నా సినిమాలు టీవీలో వచ్చినప్పుడల్లా వాళ్ళందరూ ఎంతో ఆసక్తిగా చూస్తారు. వారందరికీ నాపై చాలా గౌరవం ఉంది. నేను ఈ రంగంలోకి అడుగుపెట్టినప్పటి నుండి సినిమా పరిశ్రమలో ఎప్పుడూ చెడు అనుభవం ఎదురుకాలేదు. దానికి కారణం నేను చేసిన సినిమాలు, నేను పోషించిన పాత్రలు. నేను దానిని కోల్పోవాలనుకోవడం లేదు." అని సంవృత

# నేపాల్‌లో 'మిరాయ్' షూటింగ్



మూవీ న్యూస్ ,12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): 'హనుమాన్' సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు యువ హీరో తేజ సజ్జా. ఇప్పుడాయన నుంచి రానున్న మరో పాన్ ఇండియా చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మిస్తోంది. రితిక నాయక్ కథానాయిక. మంచు మనోజ్ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. ముగింపు దశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం నేపాల్‌లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో భాగంగా తేజపై ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నట్లు తెలిసింది. ఇది అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూన్‌లో ప్రేక్షకుల ముందుకు రానుందని సమాచారం. ఈ చిత్రం ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడిన ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండనుంది. తేజ ఇందులో సూపర్ యోధగా కనువిందు చేయనున్నారు. ఈ సినిమాకి గౌర హరి సంగీతమందిస్తున్నారు.

# విజయ్, గౌతమ్ తిన్ననూరి టైటిల్ కింగ్డమ్



మూవీ న్యూస్ ,12 ఫిబ్రవరి ( క్రాంతిన్యూస్ ): విజయ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమాకు 'కింగ్‌డమ్' అనే టైటిల్ ఖరారు చేసినట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు.

టైటిల్ తో పాటు బుధవారం నాడు టీజర్ ను కూడా ఆవిష్కరించారు. ఈ సినిమా టీజర్ తెలుగు వెర్షన్‌కి జూనియర్ ఎన్టీఆర్, తమిళ వెర్షన్‌కి సూర్య, హిందీ వెర్షన్‌కి రణబీర్ కపూర్ వాయిస్ ఓవర్ అందించారు. ఈ ముగ్గురు స్టార్లు తమ గొంతుతో రోమాలు నిక్కబొడుచుకునేలా చేసి, టీజర్‌ను మరో స్థాయికి తీసుకువెళ్లారు.

"కింగ్‌డమ్' చిత్రానికి విజయ్ దేవరకొండ ప్రాణం పెట్టి పనిచేస్తున్నారు. సినిమాని వేరే స్థాయికి తీసుకొని వెళ్ళడానికి తన వైపు నుంచి నూటికి నూరు శాతం కృషి చేస్తున్నారు. విజయ్ సినిమాకి సంబంధించిన ఏదైనా అప్డేట్ వస్తే, దేశవ్యాప్తంగా సినీ ప్రియుల దృష్టి ఉండటం సహజం. 'కింగ్‌డమ్' టీజర్ విడుదల తేదీ ప్రకటన వచ్చిన దగ్గర నుంచి, ఈ టీజర్ ఎప్పుడెప్పుడు వస్తుందా అని దేశవ్యాప్తంగా అందరూ ఎదురుచూశారు. ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా టీజర్ కట్టిపడేసింది" అని నిర్మాతలు అన్నారు .

# అల్లు అర్జున్‌తో నా ఎనర్జీ పర్‌ఫెక్ట్‌గా మ్యాచ్ అవుతుంది



మూవీ న్యూస్ ,12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ప్రస్తుతం వరుస విజయాలతో దూసుకుపోతోంది రష్మిక . తెలుగుతో పాటు బాలీవుడ్‌లోనూ సినిమాలను చేస్తూ తీరిక లేకుండా గడుపుతోంది. విక్కీ కౌశల్ కీలక పాత్రలో లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో రూపొందిన హిస్టారికల్ ఎపిక్ యాక్షన్ ఫిల్మ్ 'ఛావా' . రష్మిక కథానాయిక. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా రష్మిక ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇటీవల కాలంలో ఆమెతో కలిసి నటించిన హీరోల గురించి తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

"గొప్ప కథల్లో భాగమవడం నాకెంతో ఇష్టం. ఆ సినిమాను ప్రేక్షకులు చూసి, దాని గురించి మాట్లాడుతుంటే, మరింత సంతోషంగా ఉంటుంది. అలాంటి కథల్లోనే నటించాలనుకుంటా. నేను తెరపై కనిపించినంతసేపు ప్రేక్షకుల దృష్టి నాపై ఉండేలా చేయగలను. అదే సమయంలో ఆ సన్నివేశంలో ఎవరు నటిస్తున్నారన్న విషయాన్ని పట్టించుకోను" అని చెప్పుకొచ్చింది.

తన సహ నటుల గురించి మాట్లాడుతూ వారిపై ప్రశంసలు కురిపించింది. విక్కీ కౌశల్, అల్లు అర్జున్, రణ్‌బీర్ కపూర్‌లతో కలిసి పనిచేయడం ఎంతో సంతోషంగా అనిపించిందని తెలిపింది. "ఇటీవల నేను చేసిన సినిమాల్లోని కో-స్టార్స్ అందరూ ఎంతో మంచి వ్యక్తులు. స్నేహభావంతో, ఎదుటివారికి ఇబ్బంది కలగకుండా వ్యవహరిస్తారు. ముఖ్యంగా అల్లు అర్జున్ సర్‌తో నా ఎనర్జీ పర్‌ఫెక్ట్‌గా మ్యాచ్ అవుతుంది. ఆయనతో నటించడం ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఇక రణ్‌బీర్‌కు నాకూ నాన్సెన్స్ నచ్చదు. కేవలం పాత్రల గురించి తప్ప ఇతర విషయాలేవీ మాట్లాడుకోం. అంతా ప్రొఫెషనల్‌గా ఉంటాం. చివరిగా విక్కీ కౌశల్ అద్భుతమైన వ్యక్తి. ఇలాంటి వారు చాలా అరుదుగా ఉంటారు. వాళ్లతో కలిసి పనిచేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది" అంటూ తెలిపింది రష్మిక.

# దయచేసి నా మాటలను వక్రీకరించొద్దు



మూవీ న్యూస్ ,12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): టాలీవుడ్ నటి అనసూయ ఇటీవలే పుష్ప-2 సినిమాతో ప్రేక్షకులను అలరించారు. ఈ చిత్రంలో తనదైన పాత్రలో అభిమానులను మెప్పించారు. పుష్ప పార్ట్-1లో దాక్షాయణిగా అలరించిన అనసూయ.. పార్ట్-2లోనూ మరోసారి సినీ ప్రియులను ఆకట్టుకుంది. ప్రస్తుతం అరి మూవీ తో అభిమానులను పలకరించనుంది. పేపర్ బాయ్ ఫేం జయ శంకర్ తెరకెక్కించిన ఈ మైథలాజికల్ థ్రిల్లర్‌లో సాయికుమార్, అనసూయ భరద్వాజ్, శుభలేఖ సుధాకర్, ఆమని, వైవా కీలక పాత్రల్లో నటించారు. గతేడాదిలోనే ఈ చిత్రం రిలీజ్ కావాల్సింది కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది.

అయితే తాజాగా అనసూయ చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక్కడ నేను కేవలం నా ?అనుభవాన్ని మాత్రమే పంచుకున్నట్లు తెలిపింది. అవగాహన కల్పించడం కోసమే నా కెరీర్‌లో ఎదురైన సంఘటనల గురించి మాత్రమే మాట్లాడనని పేర్కొంది. నా మాటలను ఎవరూ వక్రీకరించవద్దని ప్రేక్షకులను, మీడియాను హృదయపూర్వకంగా అభ్యర్థిస్తున్నట్లు ట్వీట్‌లో రాసుకొచ్చింది. ఇలాంటివీ నన్ను క్యారెక్టర్‌ను డిసైడ్ చేయలేవ్.. నిజమే ఎప్పటికీ నిలుస్తుంది. నన్ను అర్థం చేసుకున్న వారికి ప్రేమను పంచుతూనే ఉంటా అని పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట చర్చనీయాంశంగా మారింది.

# అస్సలు ఊహించలేదు



మూవీ న్యూస్ ,12 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): :డాకు మహారాజ్' లో అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణతో కలిసి నటించారు బాలీవుడ్ నటి ఊర్వశీ రౌతేలా ఇందులో బాలయ్యతో కలిసి ఆమె 'దబిడి దిబిడి' పాటకు డ్యాన్స్ చేశారు. ఈ పాట విడుదలైన సమయంలో కొరియోగ్రఫీపై వచ్చిన కాంట్రవర్సీ గురించి తాజాగా ఊర్వశీ రౌతేలా స్పందించారు. ప్రేక్షకుల నుంచి ఈవిధమైన స్పందన తాను అస్సలు ఊహించలేదని అన్నారు. ఆ పాట, అందులోని స్టెప్పులను ప్రేక్షకులు ఆదరిస్తారనుకున్నానని ఆమె చెప్పారు. కానీ, ఈవిధంగా మాట్లాడతారని తాను అస్సలు అనుకోలేదని తెలిపారు.

బాలీవుడ్‌పై వర్మ కీలక వ్యాఖ్యలు :"రిహార్సల్స్ అంతా ప్రశాంతంగా జరిగింది. అన్ని పాటలకు ఏవిధంగా కొరియోగ్రఫీ ఉంటుందో అదేవిధంగా ఈ పాటకూ చేశాం. శేఖర్ మాస్టర్ ఈ పాటకు డ్యాన్స్ కొరియోగ్రఫీ చేశారు. ఇప్పటికే నాలుగుసార్లు ఆయనతో కలిసి వర్క్ చేశాను. ఆయన స్టెప్పులు చెప్పినప్పుడు నాకు ఏమాత్రం విభిన్నంగా లేదా అభ్యంతరకరంగా అనిపించలేదు. సాధారణమైన స్టెప్పుల మాదిరిగానే భావించా. కానీ, పాట విడుదలయ్యాక సోషల్‌మీడియాలో వచ్చిన విమర్శలు చూసి షాకయ్యా. కొరియోగ్రఫీని ప్రేక్షకులు తప్పుపట్టడానికి కారణం ఏమిటో అంచనా వేయడానికి కూడా సమయం లేకపోయింది. అంతా సడెన్‌గా జరిగిపోయింది. రిహార్సల్స్ చేస్తున్నప్పుడు ఇలాంటి విమర్శలు వస్తాయని మేము అస్సలు ఊహించలేదు. రిహార్సల్స్ క్లిప్స్ విడుదల చేసినప్పుడు ఎలాంటి విమర్శలు రాలేదు" అని ఊర్వశీ రౌతేలా తెలిపారు. ఏదేమైనా సోషల్‌మీడియా వేదికగా కొంతమంది కావాలని చేసే వ్యాఖ్యలను తాను పట్టించుకోనని అన్నారు. వివరణాత్మక విమర్శలను తాను స్వాగతిస్తానని చెప్పారు.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com